ప్రజాశక్తి

శుక్రవారం 28 ఏప్రిల్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అధ్యాపకుల కొరత..

పడిపోతున్న ఉత్తీర్ణత..

- ఇంటర్‌లో తప్పిపోయిన పేద విద్యార్థులు
- ఐదు కెజిబివి, రెండు జూనియర్ కళాశాలు, ఒక హైస్కూల్ ప్లస్‌లో జీరో ఫలితాలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో (కెజిబివి) అధ్యాపకుల్లేక ఇంటర్ ఫలితాలు ఏడాదికేడాది పడిపోతున్నాయి. అధ్యాపక ఖాళీలను శాశ్వత ప్రాతిపదికన భర్తీచేయకపోవడం, అతిథి అధ్యాపకులను సకాలంలో నియమించక పోవడం వంటి పలు కారణాలతో ఈ విద్యాలయాల్లో ఉత్తీర్ణత గతేడాది కంటే తగ్గింది. పేద విద్యార్థులకు పెద్ద దిక్కుగా ఉన్న ప్రభుత్వ విద్యా సంస్థలపై ప్రభుత్వ నిర్లక్ష్యం విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఖాళీలు భర్తీచేయకపోవడంతో సబ్జెక్టు అధ్యాపకుల కొరత వెంటాడ్డం, పరీక్షలకు మూడు, నాలుగు నెలల ముందు గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి అనుమతివ్వడం, నియమిత గెస్ట్ ఫ్యాకల్టీకి సరిగా జీతాలు చెల్లించకపోవడం వంటి పలు కారణాలు వల్ల ఫలితాలు గతేడాది కంటే తగ్గాయి. ఇంటర్ మొదటి ఏడాదిలో ఆనందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండేళ్ల నుంచి జీరో ఫలితాలొస్తున్నాయి. పాడేరు డివిజన్‌లోని అనంతగిరి జూనియర్ కళాశాలలో వంద మంది విద్యార్థులకు ఒక్కరూ పాసవ్వలేదు. గంగవరంలోని హైస్కూల్ ప్లస్‌లో 21 మందిలో ఒకరూ ఉత్తీర్ణులుకాలేదు. 28 కెజిబివిల్లోని మొదటి ఏడాది పరీక్షలు రాసిన అనంతగిరి, చింతపల్లి, యాడపల్లివలస, కిలగొడ, డుంబ్రిగుడ కెజిబివిల్లో జీరో ఫలితాలొచ్చాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో కూడా అనంతగిరి, చింతపల్లి కెజిబివిల్లో జీరో ఫలితాలురాగా, కిలగొడలో 34 మంది విద్యార్థులకు ఒక్కరే పాసయ్యారు.

ఉమ్మడి జిల్లాలో 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో 2022 ఇంటర్ మొదటి ఏడాదిలో 22.03 శాతం, రెండో ఏడాది 39.27 శాతం ఉత్తీర్ణులుకాగా, 2023లో మొదటి ఏడాదిలో 20.72 శాతం, రెండో ఏడాదిలో 32.60 శాతానికి ఫలితాలు పడిపోయాయి. ఈ ఏడాది మొదటి సంవత్సరంలో 5,787 మంది పరీక్షలు రాయగా 1199 మంది పాసయ్యారు. రెండో ఏడాది పరీక్షలు రాసిన 6,043 మంది విద్యార్థుల్లో 1970 మంది ఉత్తీర్ణులయ్యారు. 28 కెజిబివిలో మొదటి సంవత్సరం పరీక్షలు రాసిన 816 మంది బాలికలకు 237 మంది, రెండో సంవత్సరం పరీక్షలు రాసిన 909 మంది బాలికల్లో 447 మంది పాసయ్యారు. 2019లో ఆనందపురం జూనియర్ కళాశాల మంజూరుచేసినా అధ్యాపకులను భర్తీచేయలేదు. దీంతో 2022లో ఇంటర్ మొదటి సంవత్సరంలో పరీక్షలు రాసిన 29 మంది విద్యార్థుల్లో ఒక్కరూ పాసవనట్లే, ఈ ఏడాది పరీక్షలు రాసిన 11 మందిలో కూడా ఒక్కరూ పాస్‌కాలేదు.

ఇంటర్ తరగతులు ప్రారంభించే నాటికి అధ్యాపకుల నియామకం జరగాల్సివుంది. డిసెంబరులో నియామకాలకు ప్రభుత్వం అనుమతిచ్చింది. అతిథి అధ్యాపకుల నియామకం జనవరిలో చేపట్టారు. పరీక్షలు మార్చిలో జరిగాయి. అతిథి అధ్యాపక నియామకాలకు, పరీక్షలకు

మిగతా 2లో..

జగనన్న కాలనీల నిర్మాణం వేగవంతం

జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్‌వర్మ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న కాలనీల నిర్మాణాలను వేగవంతం చేసి లబ్ధిదారులకు అందించాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఆనందపురం మండలం గిడిజాలలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు.. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అవసరమైతే అదనంగా కార్మికులను ఉపయోగించి పనులు వేగవంతం చేయాలన్నారు. ఫేజ్-2లో నిర్మిస్తున్న మొత్తం 855 ఇళ్లలో 538 వివిధ దశల్లో ఉన్నాయని, 317 ఇళ్లకు గ్రౌండ్‌లెవెల్ పనులు ప్రారంభించాలని చెప్పారు. ఫేజ్-3లో 1390 ఇళ్లకు గానూ 1325 ఇళ్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. 65 ఇళ్లను ప్రారంభించలేదని చెప్పారు. ఈ పనులను త్వరితగతిన మొదలుపెట్టాలని ఆదేశించారు. అవసరమైతే సెంట్రింగ్ మెటీరియల్ ఎక్కువగా సిద్ధంచేసుకోవాలని సూచించారు. కాంట్రాక్టర్‌కు మౌలిక వసతులు కల్పించాలని, ఐసిఐసిఐ బ్యాంక్‌కు సంబంధించిన సమస్యలుంటే పరిష్కరించాలని, ప్రతి ఇల్లూ మ్యాపింగ్ జరగాలని చెప్పారు. లే-అవుట్‌లలో వార్డు కార్యదర్శుల కార్యాలయం, హాస్పిటల్, లైబ్రరీతో పాటు రోడ్లు, కాలువలు, ప్రహరీ, వీధి లైట్లు కల్పించేందుకు అంచనాలు సిద్ధంచెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, యుసిడి పీడీ పాపునాయుడు, విఎంఆర్‌డిఎ ప్రధాన ఇంజినీర్ శివప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

గిడిజాలలో ఇళ్లను పరిశీలిస్తున్న జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మ

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

▶ వార్త మెయిన్‌లో..

విశాఖలో కిడ్నీ మాఫియా కలకలం

▶ వార్త మెయిన్‌లో..

కండిషన్ మానిటరింగ్ లగ్జరీ కాదు అవసరం

▶ వార్త మెయిన్ 3లో..

మేడే సాంస్కృతిక సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా మే 1 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే మేడే సాంస్కృతిక సంబరాలను జయప్రదం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను జివిఎంసి గాంధీవిగ్రహం వద్ద గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మేడే ప్రపంచ కార్మికులను తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యం చేసే దినమని అన్నారు. కార్మికులకు పండగ దినమైన మేడే రోజున కార్మికుల పనిప్రదేశాల్లోనూ, నివాస ప్రాంతాల్లోనూ ఆట, పాటలతో సంబరాలు జరపాలని పిలుపునిచ్చారు.

ఏప్రిల్ 30న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాంస్కృతిక సంబరాలను మే 1న జివిఎంసి గాంధీవిగ్రహం వద్ద నిర్వహించే బహిరంగసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరణలో సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్లు ఎస్.జ్యోతీశ్వరరావు, బి.జగన్, ఎం.సుబ్బారావు, వి.కృష్ణారావు, చంద్రమౌళి, వి.నరేంద్రకుమార్, పి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మేడే సాంస్కృతిక ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

రెజ్లర్ల పోరాటానికి ప్రజాసంఘాల మద్దతు

ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను కఠినంగా శిక్షించాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు, బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఐదు రోజులుగా రెజ్లర్లు చేస్తున్న పోరాటానికి సంఘీభావం తెలియజేస్తూ గురువారం జివిఎంసి గాంధీవిగ్రహం వద్ద విశాఖ జిల్లా సిఐటియు, ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ, రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఇంత వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. దేశానికి వన్నెతెచ్చిన క్రీడాకారుల పట్ల బిజెపి వ్యవహరిస్తున్న తీరును తప్పుబట్టారు. ఆ ఎంపీని మోడీ ప్రభుత్వం కాపాడుతోందని

నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు, మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

దుయ్యబట్టారు. దేశంలో ఆదానీకి ఆస్తులను దోచుపెట్టడం, రూ.లక్షల కోట్లు బ్యాంకుల్లో లోన్లు తీసుకొని ఎగ్గొట్టినవారిని, యుపిలో ఉన్నావోలో మహిళపై అత్యాచారం చేసిన వారిని రక్షించడం, బాధితురాలి ఇంటిని తగలబెట్టడం మోడీ, బిజెపి నైజంగా స్పష్టమవుతోందన్నారు. కమిటీ చేసిన సిఫార్సులను కూడా బయట పెట్టలేదన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో ఒక మైనర్ కూడా ఉన్నారని తెలిపారు. కేంద్ర

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

అధ్యాపకుల కొరత.. పడిపోతున్న ఉత్తీర్ణత...

మధ్య వ్యవధి మూడు నెలలు కూడా లేకపోవడంతో సిలబస్ పూర్తికాలేదు. దీంతో జూనియర్, కెజిబివిల్లో అత్యధిక మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాలేకపోయారు. గతేడాది కూడా అతిథి అధ్యాపకులు నియామకానికి ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమిషనర్ జనవరి చివరి వారంలో అనుమతిస్తే, ఫిబ్రవరిలో నియామకాలు పూర్తిచేశారు. ఈ ఏడాది దాదాపు నియామకాలు అలానే జరిగాయి. అనంతగిరి కెజిబివిలో ఫిజిక్స్ బోధించే అధ్యాపకుడు లేరు. సబ్జెక్టు అధ్యాపకుల కొరత ప్రభుత్వ ఇంటర్ విద్యాలయాల్లో వెంటాడుతోంది. అధ్యాపకుల కొరత ప్రభావం విద్యార్థుల ఉత్తీర్ణతపై పడింది.

రెజ్లర్ల పోరాటానికి ప్రజాసంఘాల మద్దతు

ప్రభుత్వ "బేటీ బచావో, బేటీ పడావో" నినాదం గాలిమాటగా ఉండిపోయిందని ఎద్దేవా చేశారు. క్రీడాకారులకు సైతం బిజెపి రక్షణకల్పించడం లేదని ప్రపంచానికి తెలిసిలా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. రెజ్లర్ల పోరాటానికి దేశంలో ఉన్న మేధావులు, ప్రజా సంఘాల నేతలు క్రీడాకారుల వద్దకు వెళ్లి సంఘీభావం తెలియజేస్తున్నా బిజెపిలో చలనం రావటంలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, ఎపి బాక్సింగ్ అసోసియేషన్ ఛైర్మన్ దండునాగేశ్వరరావు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యుఎస్ఎన్.రాజు, కె.సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, ప్రజాసంఘాల నాయకులు ఎస్.జ్యోతీశ్వరరావు, బి.జగన్, ఎం.సుబ్బారావు, బి.రమణి, ఆర్.విమల, కె.కుమారి, భారతి, కొండమ్మ, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : నేషనల్ హెల్త్ మిషన్ వివిధ విభాగాలలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న సుమారు 20 వేల మంది ఉద్యోగులకు వేతనాల పెంపును అమలుచేయాలని ఎపి ఎన్‌హెచ్ఎం జెఎసి ఛైర్మన్ డి.దయామని ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. 11వ పిఆర్ సి ప్రకారం 2022 జనవరి నుంచి రెగ్యులర్ ఉద్యోగులతో పాటు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీవో 5, 7 ప్రకారం వేతనాలు పెంపును అమలు చేస్తున్నారని తెలిపారు. అయితే నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు నాటి నుంచి నేటి వరకు వేతనాల పెంపు అమలు చేయలేదని వివరించారు. 2022 ఆగస్టు 16,18 తేదీలలో వైద్య ఆరోగ్య శాఖ ఉన్నత స్థాయి అధికారులు, ఉద్యోగుల సంఘం ప్రతినిధులతో చర్చలు జరిపి వేతనాలు పెంచుతామని, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని అంగీకరించినప్పటికీ నేటి వరకు అమలు చేయలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 30న విజయవాడలో ఎపి ఎన్‌హెచ్ఎం జెఎసి సమావేశాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించాలి

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ప్రపంచాన్నే పీడిస్తున్న ప్లాస్టిక్ భూతాన్ని తరిమేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. గురువారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రతినిధులు, ప్లాస్టిక్ హోల్ సేల్, రిటైల్ డీలర్స్, నివాసిత సంక్షేమ సంఘాలు, ఎన్జీవోస్, సూపర్ మార్కెట్లు తదితర వ్యాపారస్తులతో నిషేధిత ప్లాస్టిక్ నియంత్రణ చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, భావితరాలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు అందరి సహకారంతో ప్లాస్టిక్ నియంత్రణకు చేపట్టే కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రత్యామ్నాయ వస్తువులను వాడాలని సూచించారు.

స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిరసిస్తూ 3న నిరసనలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను నరేంద్రమోడీ ప్రభుత్వం అమ్మడాన్ని వ్యతిరేకిస్తూ మే 3న రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు, హైవేలు దిగ్బంధనం చేపట్టాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు 755వ రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరంలో ఐద్వా, సిఐటియు, డివైఎఫ్ఐ సంఘాల నాయకులు, కార్యకర్తలు కూర్చున్నారు. ఈ దీక్షలనుద్దేశించి నర్సింగరావు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకోసం తెలుగురాష్ట్రాల ప్రజలు పోరాడుతుంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమ్మేస్తామని పదే పదే ప్రకటనలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్లాంట్‌ను కొనేందుకు ఎవరూ సాహసం చేయలేకపోవడంతో మోడీ ప్రభుత్వం ఉత్పత్తి సామర్థ్యాన్ని తగ్గించే చర్యలు చేపట్టిందని విమర్శించారు. మోడీ అధికారంలోకి వచ్చాక స్టీల్‌ప్లాంట్‌తో పాటు అనేక ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందన్నారు. ప్లాంట్‌ను రక్షించుకోవడం కోసం మే 3న రాష్ట్ర వ్యాప్తంగా కార్మికవర్గం, రైతులు చేపట్టిన రాస్తారోకోలు, హైవేల దిగ్బంధాలలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. 2024 ఎన్నికలలో మోడీని, బిజెపిని గద్దెదించి స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు బి.జగన్, ఎస్.జ్యోతీశ్వరరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, నాయకులు కె.కుమారి, ఆర్.విమల, బి.రమణి, భారతి, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో కూర్చున్న సిహెచ్.నర్సింగరావు తదితరులు

'భూ కబ్జాలు అడ్డుకున్నందుకు కుల బహిష్కరణ'

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : భూ కబ్జాలను అడ్డుకున్నందుకు తమ కుటుంబాలను కుల బహిష్కరణ చేశారని వాసుపల్లి మారాజు ఆరోపించారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భీమిలి 4వ వార్డు పరిధి మంగమారిపేటలో హైదరాబాద్ వాసి పివిఎస్ఎన్ మూర్తికి చెందిన 63 సెంట్లు భూమికి వాచ్‌మ్యాన్‌గా పనిచేస్తున్నానని చెప్పారు. ఆ భూమికి కొందరు స్థానికులు, గ్రామ పెద్దలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు దొంగ పత్రాల ద్వారా రిజిస్ట్రేషన్ చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలియడంతో దానిని అడ్డుకున్నామని తెలిపారు. దీంతో వారందరూ తమపై కక్షకట్టారని ఆరోపించారు. స్థానిక పెద్దలు దూడ అచ్యుతరావు, మేరుగు పుల్లయ్య, సూరాడ పరదేశి, ఉమ్మడి నరసింగరావు, గరికిన రాజు, విశాఖకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు పేరా బత్తుల నాగవరప్రసాద్, నన్నపనేని రాజా తమపై దాడులు చేసేందుకు కొంతమందిని ఉసిగొలుపుతున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో తమ కుటుంబాలను కుల బహిష్కరణ చేశారని చెప్పారు. తమకు వారి నుంచి ప్రాణహాని ఉందని, తమకు ఏదైనా జరిగితే వారే బాధ్యత వహించాలని, సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వాసుపల్లి గురుమూర్తి పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై పోస్టర్ విడుదల

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఈ నెల 30న జాతీయ బాల కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు మద్దతు పలకండి అనే నినాదంతో బాల వికాస ఫౌండేషన్ సంస్థ రూపొందించిన పోస్టర్‌ను గురువారం ఏయు జర్నలిజం విభాగాధిపతి వినయకుమార్ , ఆచార్య డివిఆర్.మూర్తి, నరవ ప్రకాశరావు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యమేనన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాబ్జీ, కృష్ణ, మహాలక్ష్మి, కరుణ్ పాల్గొన్నారు.

గీతం స్వదేశీ పెల్లెటైజేషన్‌తో రైతులకు మేలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : వ్యవసాయ జీవనోపాధి, ఆహార వృథా సంక్షోభాన్ని పరిష్కరించేందుకు కృషి చేస్తూ ఆంధ్రప్రదేశ్‌లోని రైతు సంఘాలను శక్తివంతం చేసేందుకు గీతం కృషి చేస్తోందని పెల్లెటైజేషన్ ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్ తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఒక ప్రత్యేకమైన కంపోస్ట్ పెల్లెటైజేషన్ ప్రాజెక్ట్ ద్వారా ఆహార పదార్థాలను పెంచుతూ, వ్యవస్థాపక నైపుణ్యాలను అభివృద్ధి చేయటంలో రైతులకు సహాయం చేస్తోందని చెప్పారు. భారత ప్రభుత్వం నుంచి దాదాపు రూ.40 లక్షల గ్రాంట్‌ను అందుకున్న ఈ ప్రాజెక్టు, ఆహార వ్యర్థాలు, నాణ్యమైన వ్యవసాయ కంపోస్ట్ లభ్యత ద్వంద్వ సమస్యలను పరిష్కరిస్తుందని తెలిపారు. ఈ సరికే శ్రీకాకుళం, విజయనగరంలలో ప్రచారం నిర్వహించి రైతులకు కంపోస్ట్ గుళికలు తయారీలో శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. జివిఎంసితో పాటు రైతు సంఘాల మద్దతు కూడా దీనికి లభించిందన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ సిహెచ్ రామకృష్ణ, డాక్టర్ కె.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

టిడిపి ఓటర్ వెరిఫికేషన్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : 20వ వార్డు పెద్దవాల్తేరు, కాగితాలవారి వీధి ప్రాంతాల్లో వార్డు అధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి ఆధ్వర్యాన ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోతన్నరెడ్డి మాట్లాడుతూ, తొలగించిన ఓటర్లు ఎవరైనా ఉంటే కొత్తగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోవిందా, నరేంద్ర, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిష్యశాస్త్రం పున:ప్రారంభించాలి

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఏపీలోని అన్ని యూనివర్శిటీల్లోనూ జ్యోతిష్యశాస్త్రాన్ని పున:ప్రారంభించాలని వాస్తు, జ్యోతిష్య పండితులు లక్కోజు శివరామ కోరారు. ఈ మేరకు ఆయన తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబుకు వినతిపత్రం అందజేశారు.

వైర్‌లెస్ కాలనీలో డిఆర్ఎం ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రైల్వే కాలనీలలో సౌకర్యాలు పరిశీలించేందుకు డివిజనల్ రైల్వే మేనేజర్ అనుప్ సత్పతి గురువారం వైర్‌లెస్ కాలనీలో సీనియర్ డివిజనల్ ఇంజినీర్ (హెడ్ క్వార్టర్స్) ఎస్‌కె.సారంగి, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజినీరింగ్ శాఖ అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రాథమిక సౌకర్యాలు, పారిశుధ్యం, భద్రత, రైల్వే క్వార్టర్ల పరిస్థితిని మెరుగుపరిచేందుకు పరిశీలించారు. అనుప్ సత్పతి రైల్వే క్వార్టర్ల నిర్మాణానికి స్థలాలను పరిశీలించారు.

29న శ్రీశ్రీ జయంతి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : అమర కళాకారుల శతజయంతి, శ్రీశ్రీ 113వ జయంతి ఉత్సవాలను శనివారం పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ నాయకుడు జి.కాసులరెడ్డి తెలిపారు. ఆ రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రజానాట్యమండలి అభ్యుదయ గేయాలాపనతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఉదయం శ్రీ మాతృశ్రీ కళానికేతన్ వారి 'ఇది కథ కాదు' నాటిక ప్రదర్శన ఉంటుందని, మధ్యాహ్నం 2 గంటలకు అభ్యుదయ కవి శ్రీశ్రీ రూపకం నాటిక ప్రదర్శన, అనంతరం ముగింపు సభ ఉంటుందని పేర్కొన్నారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE, AT: ANAKAPALLE
E.A.334/2022 & E.A.261/2022 in E.P.29/2014 in O.S.142/2006
Between:
Bokam Ramalakshmi & others ...Petitioners
And:
Bheesetti Krishna Appa Rao & others ...Respondents
NOTICE
To,
Respondent No.10:
M/s. V. Ramamurthy & Sons,
Office at D.No.36-46-37,
Kancharapalem
Visakhapatnam-530008
Please take notice that the above named petitioners has instituted the above case against you and the matter stands posted to **12-05-2023** for your appearance. On that day at **10:30 A.M.** you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be determined in your absence, ex-parte.
G. MUTYALA NAIDU,
Advocate, Anakapalli,
Cell: 7075177711.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE, AT: ANAKAPALLE
E.A.335/2022 & E.A.262/2022 in E.P.29/2014 in O.S.142/2006
Between:
Sri Pothamsetty Rama Seshu Kumar & others ... Petitioners
And:
Bheesetti Krishna Appa Rao & others ... Respondents
NOTICE
To,
Respondent No.10:
M/s. V. Ramamurthy & Sons,
Office at D.No.36-46-37,
Kancharapalem
Visakhapatnam-530008
Please take notice that the above named petitioners has instituted the above case against you and the matter stands posted to **12-05-2023** for your appearance. On that day at **10:30 A.M.** you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be determined in your absence, ex-parte.
R. RAMA RAO,
Advocate, Anakapalli,
Cell: 9290975436.

IN THE HON'BLE COURT OF THE JUNIOR CIVIL JUDGE, AT: GAJUWAKA
O.S.108/2022
Between:
CANARA BANK, Kurmannapalem Branch, Visakhapatnam,
Rep. by its Branch Manager ...Plaintiff
And:
M/s. Shri Saibaba Catering Services,
Rep. by its Managing Partner
Sri Gattem Jyotheswara Rao & 5 others ...Defendants
SUMMONS
To,
D-5: Sri Tripurana Venkata Ramana,
S/o. Janardhana Rao, Managing Partner,
M/s. T.V.R Trasport & Rail Cargo,
R/at 43-71-33/3, Back side of Srikanya Theatre, Railway New Colony,
Visakhapatnam (A.P)-530016.
D-6: Smt. Tripurana Madhavi,
D/o. Jyotheswara Rao,
W/o. T. Venkata Ramana, Hindu,
aged 37 years, Partner of
M/s. T.V.R. Transport & Rail Cargo,
R/at: # 43-71-33/3, Back side of Srikanya Theatre, Railway New Colony,
Visakhapatnam (A.P)-530016.
Take notice that, the above named plaintiff instituted the above suit against you under Order VII Rule (1) read with section 26 of Civil Procedure Code for suit claim. You are hereby summoned to appear in the above Court in person or by Pleader duly instructed and able to answer all material questions relating to the above suit on the day **15-05-2023 at 10:30 A.M**. Take notice that in default of your appearance on that day and hour, the suit will be heard and determined in your absence basing on the material available in the Court.
G.V.S. PURUSHOTHAMA RAO,
Advocate, Visakhapatnam.
Cell :8197845400.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.A.121/2023 in O.S. 210/2006
Between:
Sri K. Srinivasa Rao ...Petitioner / Plaintiff
And:
Md. Shafi & others (Defendants 8 to 10 Amended as per order in I.A. 203/2022 dt.21-09-2022) ...Respondents / Defendants
NOTICE
To,
Respondent No.3:
Kum. Shamim Akthar,
D/o. late Peer Ahmed,
Muslim, aged 51 years,
R/at D.No.38-32-25/1,
Marripalem, Visakhapatnam.
Please take notice that the above named petitioner/plaintiff has filed the above I.A.121/2023 in O.S. 210/2006 against you and the matter stands posted to **09-05-2023** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **09-05-2023** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.
P. RAMA RAO &
P.S. RAVI CHANDRA RAO
Advocates, Visakhapatnam,
Cell: 9440590149.

మహారాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు యలమంచిలి
H.M.O.P. 4 / 2022
బిట్వీన్:
దాట్ల ఉమ . . . వాది / పిటీషనర్
అండ్:
దాట్ల రాజా . . . ప్రతివాది / రెస్పాండెంట్
ప్రతివాదికి నోటీస్
టు:
దాట్ల రాజా, తండ్రి గణేష్‌సింగ్ (లేటు)
తమ్మపాల గ్రామం మరియు మండలం.
అనకాపల్లి జిల్లా.
యిందుమూలంగా మీకు తెలియజేయునది ఏమనగా పై కేసులో ప్రతివాదిలైన మీ హాజరు నిమిత్తం **తేది: 11-05-2023కి** వాయిదా వేసినారు. కావున యీ ప్రకటన నోటీసుగా భావించి పై తేదీన పై కోర్టు వారి ఎదుట **ఉదయం గం. 10-30లకు** స్వయంగా గాని ప్లీడరుద్వారా గాని హాజరై వాదన చేసుకోన వలెను. లేనిచో పై కేసులో మీకు వాదన లేదని భావించి మీ పరోక్షమున తీర్మానించడమగును.
కర్రి ఆంజనేయులు
అడ్వకేట్, యలమంచిలి,
అనకాపల్లి జిల్లా. సెల్:9848204733

పరీక్ష తప్పిన విద్యార్థికి పరాభవం!

దాడి చేసి, చితక్కొట్టిన వైసిపి కుటుంబీకులు

పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

బాధిత విద్యార్థి రవికిరణ్

ప్రజాశక్తి- సీతమ్మధార: ఇంటర్ పరీక్ష తప్పిందని తీవ్రమైన మనోవేదనతో ఏడుస్తున్న విద్యార్థి పట్ల వైసిపి మహిళానేత కుటుంబీకులు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. పరీక్ష పోయిందన్న బాధలో ఎవరికి కనబడకుండా ఉండేందుకు ఒక మూలన ఉన్న కారులో కూర్చుని ఏడుస్తుండగా, కారు ఎక్కిన పాపానికి నిర్బంధించి, దౌర్జన్యంగా దాడి చేసి కొట్టిన వైసిపి నేతల దురాగతం రామకృష్ణానగర్‌లో చోటుచేసుకుంది. దీనిపై బాధిత విద్యార్థి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితులు తెలిపిన వివరాలివి. అధికార పార్టీ చెందిన నేతలమని అహంకారమో, లేకుంటే తామేది చేసినా చెల్లుతుందన్న అధికార దర్పమో తెలియదు గానీ, కొందరు వైసిపి నేతల దుశ్చర్యలు ఆగడం లేదు. పార్టీ పేరు చెప్పుకొని చోటామోటా మహిళా నేతలూ రెచ్చిపోతున్నారు. ఇంటర్ పోయిందన్న బాధ, తల్లిదండ్రులు మందలిస్తారన్న భయంతో లలితానగర్ ప్రాంతానికి చెందిన ఎస్.రవికిరణ్, బుధవారం సాయంత్రం రామకృష్ణానగర్, తొండం వినాయకుడి గుడి సమీపంలో ఓ మూలబడిన ఉన్న కారులోకి ఎక్కి ఏడుస్తూ కూర్చున్నాడు. కారులో కూర్చున్న పాపానికి, కారునే దొంగిలించేందుకు వచ్చాడంటూ వైసిపి మహిళా నాయకురాలిగా చెప్పుకొంటున్న సింగాలమ్మ శివమెత్తింది. ఆ ప్రాంతానికి వైసిపి యూత్ ప్రతినిధిగా చెప్పుకునే తన కొడుకు సునీల్‌ను పిలుచుకొచ్చి ఆ విద్యార్థిపై దౌర్జన్యం చేయించింది. కారులో అనుమతి లేకుండా కూర్చున్నందుకు క్షమాపణ చెప్పినా వినకుండా సునీల్ కొట్టడంతోపాటు, మరో ఇద్దర్ని పిలిచి కొట్టించాడు. దుస్తులు విప్పించి దుర్భాషలాడారు. ఫోన్ లాక్కున్నారు. గంటల తరబడి నిర్బంధించారు. తనపై జరిగిన దాడి విషయమై బాధిత విద్యార్థి రవి ఫోర్త్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు గతంలోని ఇదే పోలీస్‌స్టేషన్‌లో పలు ఫిర్యాదులు తెలుస్తోంది. కాగా దీనిపై వైసిపి యువ నేత సునీల్ వివరగా కోరగా, తాను సంఘటనాస్థలంలో లేనని, విద్యార్థిని ఎవరూ కొట్టలేదని అన్నారు. కారులో కూర్చున్నందుకు అడిగామే తప్ప కొట్టలేదని చెప్పుకొచ్చాడు.

కోరమండల్ సిఎస్ఆర్ నిధులతో ఆధునీకీకరించిన

హాస్టల్ భవనాలు పున:ప్రారంభం

పున:ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి -గాజువాక : కోరమండల్ ఇంటర్నేషనల్ సిఎస్ఆర్ నిధులు రూ.93లక్షలతో పునర్నిర్మించిన పెదగంట్యాడ మండలం, 74, 75 వార్డుల పరిధిలోని నడుపూరు, దయాళ్‌నగర్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల కాలేజీ హాస్టల్ భవనాలను స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తాను చిన్నతనంలో హాస్టల్‌లోనే ఉండి చదువుకున్నానని, కానీ అప్పట్లో ఇన్ని సౌకర్యాలు లేవన్నారు. ప్రభుత్వం నాడునేడు నిధులతో హాస్టళ్లు, ఆసుపత్రులు, విద్యాలయాలను ఎంతో అభివృద్ధి చేస్తోందన్నారు. దీనికి తోడుగా కోరమండల్ వంటి సంస్థలు కూడా తమ సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధికి సహకరించడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. సాంఘిక సంక్షేమహస్టళ్లను ఆధునిక హంగులతో తీర్చిదిద్ది, అన్ని సౌకర్యాలు కల్పించిన కోరమండల్ సంస్థను అభినందించారు. వీటిని సద్వినియోగం చేసుకుని, విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. జిల్లాలో కోరమండల్ సంస్థ రెండు హాస్టళ్లను, దివీస్ మరో రెండు హాస్టళ్ల అభివృద్ధి చేస్తోందని, మరో ఆరు హాస్టళ్ల అభివృద్ధికి మరిన్ని సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. రెండు హాస్టళ్లను అధునాతనంగా అభివృద్ధి చేసిన కోరమండల్ సంస్థను అభినందించారు. స్థానిక కార్పొరేటర్ వంశీరెడ్డి మాట్లాడుతూ నేడు కార్పొరేట్ పాఠశాలలతో ప్రభుత్వ విద్యాసంస్థలు పోటీపడుతున్నాయంటే అది సిఎం జగన్ కృషి ఫలితమేనన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి తిప్పల దేవన్ రెడ్డి, లో డిసిఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి, కోరమండల్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఎం.జ్ఞానసుందరం, హైదరాబాద్ సిఎస్ఆర్ హెడ్ అమృత శ్రీవాత్సవ , డిపిసి జనవరి మేనేజర్ గణపతి, జిల్లా కోపరేటివ్ ఆఫీసర్ మిల్లన్, వార్డెన్ అలివేలు మంగ, వార్డు అధ్యక్షులు ఎన్వై నాయుడు పాల్గొన్నారు..

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్రజాశక్తి -పిఎం పాలెం : పిఎంపాలెంలోని 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలోని బక్కన్నపాలెం 11కెవి ఫీడర్ మరమ్మతు పనులు, చెట్టు కొమ్మలు తొలగింపు, లైన్ మెయింటెనెన్స్ ఇతర పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎఇఇ ఎం. అప్పలనాయుడు తెలిపారు. జోన్ 3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు తులసీనగర్,అశోక్ నగర్, ఎస్ సి, ఎస్ టి లేఔట్, ఆర్ హెచ్ కాలనీ, ముస్లిం కాలనీ, మెయిన్ రోడ్ ఎస్‌బిఐ నుండి చేపల మార్కెట్ వరకు విద్యుత్ సరఫరా నిలిపి నిర్వహణ పనులు చేస్తామని, వినియోగదారులు గ్రహించి, సహకరించాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ: ఎండాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని వివేకానందనగర్, దసపల్లా లే అవుట్ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా ఈ నెల 29న శనివారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని జోన్ 3 ట్రాన్స్‌కో డిఇఇ పి. శ్రీనివాసరావు తెలిపారు. వివేకానందనగర్, సిర్పుడి నగర్, పెట్రోల్ బంక్ బ్యాక్‌సైడ్, దసపల్లా లేఅవుట్, తాటిచెట్లపాలెం లలితానగర్, సుబాష్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుండి మధ్యాహ్నం 4గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఎఇ రాజేష్ కోరారు.

నేరాలు ఘోరాలు

అప్పుల బాధ తాళలేక యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -గాజువాక : అప్పుల బాధ తట్టుకోలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన, సింహగిరి కాలనీలో చోటుచేసుకుంది. సింహగిరి కాలనీకి చెందిన రోహిత్ ప్రసాద్ (23) గతంలో చాలా అప్పులు చేశారని, అవి తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నారని గాజువాక పోలీసులు తెలిపారు. తండ్రి మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన

బిజెపి ఎంపిని అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి- గాజువాక : మహిళా రెజ్లింగ్ క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ భూషణ్ సింగ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని అరెస్ట్ చేయాలని డివైఎఫ్ఐ గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు తమకు న్యాయం చేయాలని బాధిత రెజ్లర్లు నాలుగురోజులుగా ధర్నా చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షునిగా వ్యవహరిస్తున్న బ్రిజ్ భూషణ్ సింగ్‌పై ఫోక్స్ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. కేంద్రంలో అధికార పార్టీ బిజెపికి చెందిన ఎంపీ కావడం వల్లే పోలీసులు కేసు నమోదు, తదనంతరం చర్యలు చేపట్టడంలో కాలయాపన చేస్తున్నారని, తక్షణమే నిందితుడిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

ఎయు విసితో డిప్యూటీ మేయర్ భేటీ

ప్రజాశక్తి -కరాస: ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య పివిజిడి.ప్రసాద్‌రెడ్డిని విశాఖ నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. విసి చాంబర్‌లో ప్రసాదరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన శ్రీధర్, ఆయనతో కొద్దిసేపు ముచ్చటించారు. పరిపాలనా రాజధానిగా విశాఖ నుంచే త్వరలోనే పరిపాలన కొనసాగిస్తామని ముఖ్యమంత్రి జగన్ ఇటీవల మరోమారు స్పష్టం చేసిన నేపథ్యంలో ఎయులో మౌలిక సౌకర్యాలు, అభివృద్ధిపై చర్చించారు. విశాఖకే తలమానికంగా ఉన్న ఎయును మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని విసి ప్రసాదరెడ్డిని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కోరారు.

ప్రజలకు ముఖం చూపించలేక పోతున్నాం

ఆనందపురం మండల సభలో పలువురి సర్పంచుల ఆవేదన

మండల సభలో నిలబిస్తున్న మామిడిలోవ సర్పంచ్ మల్లికార్జునరావు

ప్రజాశక్తి -ఆనందపురం : నిధుల లేమితో గ్రామాల్లో సమస్యలను పరిష్కరించలేక, సౌకర్యాల కల్పించలేని దుస్థితిలో ప్రజలకు ముఖాలను చూపించలేకపోతు న్నామని మామిడిలోవ సర్పంచ్ బలిరెడ్డి మల్లికార్జున రావు(చంటి) ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఎంపిపి మజ్జి శారద ప్రియాంక అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశంలో ముఖ్యఅతిథి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతుండగా, అడ్డుతగిలి పలు సమస్యలపై నిలదీసి, తన ఆక్రోషాన్ని వెల్లగక్కారు. దీనికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి స్పందిస్తూ, మండల సమావేశాన్ని రాజకీయం చేయొద్దంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల సమావేశంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతుండగా, అడ్డుతగిలిన మామిడిలోవ సర్పంచ్ బలిరెడ్డి మల్లికార్జునరావు మాట్లాడుతూ, గడచిన నాలుగేళ్లలో గ్రామాల్లో ఒక్కపనైనా చేయలేక ప్రజల ముందుకు వెళ్లాలంటే సిగ్గేస్తుందన్నారు. జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించినప్పటికీ నేటికీ పూర్తికాలేదని, రోడ్లు అధ్వాన్నస్థితిలో ఉన్నా పట్టించుకునే దిక్కులేదని, సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత ప్రజలెన్నుకున్న సర్పంచ్‌లకు కనీస సమాచారం ఇవ్వకుండా వైసిపి నేతలే ఇష్టానుసారంగా అన్నింటిలోనూ కలగజేసుకుని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామంలో ఆరోగ్యశ్రీ వైద్యానికి వెళితే, బిల్లులు చెల్లించడం లేదంటూ కార్పొరేటు ఆసుపత్రుల్లో వైద్యం అందించక తిప్పిపంపుతున్నారని వివరించారు. దీనిపై ముత్తంశెట్టి స్పందిస్తూ, సమాధానం చెప్పలేక, సమస్యలను రాజకీయం చేయొద్దంటూ తిరిగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు నెలల క్రితం రూ.60లక్షలతో జలజీవన్‌మిషన్ పనులు ప్రారంభించినా, బోర్లు వేసి మిగతా పనులు పూర్తి చేయకుండా అర్ధాంతరంగా వదిలేశారని ఆనందపురం సర్పంచ్ చందక లక్ష్మి విన్నవించారు. కోర్టు పరిధిలో ఉన్న 459మంది లబ్ధిదారుల జగనన్న ఇళ్ల సమస్యను పరిష్కరించాలని జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు కోరారు. 80 మంది లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల బిల్లులు రాలేదని, వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పాలవలస సర్పంచ్ నాగోతు నరసమ్మ కోరారు. గంభీరం రిజర్వాయర్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో హెచ్చరిక బోర్డుల ఏర్పాటుతోపాటు రక్షణ చర్యలు చేపట్టి అభివృద్ధి చేయాలని వైస్ ఎంపిపి బొట్ట ధనలక్ష్మి రామకృష్ణ కోరారు. వీధి కుక్కల బెడద నివారించాలని జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు సూచించారు. కెజిబివిలో ఆరోతరగతిలో ప్రస్తుతమున్న 40సీట్లను పెంచాలని కస్తూర్బా విద్యాలయం ప్రత్యేకాధికారి చంద్రకళ కోరారు. అధ్వానంగా ఉన్న బాలికల హాస్టల్ రోడ్డు బాగుచేయాలని వార్డెన్ విన్నవించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ లవరాజు, తహశీల్దార్ లోకవరపు రామారావు, వైస్ ఎంపిపిలు పాండ్రంకి శ్రీను, బొట్ట ధనలక్ష్మి రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, వైస్‌చైర్మన్ బోని అప్పలనాయుడు, పార్టీ ప్రెసిడెంట్ బంక సత్యనారాయణ, సర్పంచులు గనిరెడ్డి శ్రీనివాసరావు, బలిరెడ్డి మల్లికార్జునరావు, బిఆర్‌బి నాయుడు, చందక లక్ష్మి, లోడగల రమణ పాల్గొన్నారు

మండల సభలో సమస్యల ఏకరువు

నిధుల్లేవంటూ అధికార పార్టీ సర్పంచుల ఆవేదన

ప్రొటోకాల్‌పై విపక్ష ఎంపిటిసిల పెదవి విరుపు

భీమిలి మండల సర్వసభ్య సమావేశం

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : అధికార, విపక్ష ఎంపిటిసిలు, సర్పంచ్‌లు సమస్యల ఏకరువుతో మండల సర్వసభ్య సమావేశం సమస్యలు చెప్పుకునే వేదికైంది. గురువారం ఎంపిపి డివిఎస్ఎస్ఎన్ రాజు అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికార పార్టీకి చెందిన పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్‌లే నిధులు లేక అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారం చేయలేకపోతున్నామని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎదుట వాపోయారు. మజ్జి పేట సర్పంచ్ మజ్జి సూరినాయుడు మాట్లాడుతూ, ఆర్‌బికె, గ్రామ సచివాలయ భవనాలకు నిధుల లేక కనీసం విద్యుత్ సదుపాయం కల్పించలేని దుస్థితి ఉందని సభలో ప్రస్తావించారు. బోడమెట్టపాలెం సర్పంచ్ ముద్దాడ అప్పయ్యమ్మ మాట్లాడుతూ, పంచాయతీ కార్యాలయంలో చీకట్లోనే ఉండాల్సిన పరిస్థితి ఉందని వాపోయారు. రేఖవానిపాలెం సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు మాట్లాడుతూ, జగనన్న ఇళ్ల పథకం కింద తమ పంచాయతీలోని లబ్ధిదారులకు దూరంగా ఉన్న బోడమెట్టపాలెం క్వారీకి దగ్గర్లో నివాసయోగ్యం కాని స్థలాలు కేటాయించారని సభలో ప్రస్తావించారు. దీనిపై తహశీల్దార్ కోరాడ వేణుగోపాల్ మాట్లాడుతూ, స్థానికులకు ఇళ్లస్థలాల కేటాయింపులో తొలి ప్రాధాన్యతనిచ్చామని , రెండో ప్రాధాన్యత కింద రేఖవానిపాలెం పంచాయతీకి చెందిన కొందరికి ఇళ్లస్థలాలు కేటాయించినట్లు వివరించారు. టిడిపికి చెందిన చిప్పాడ ఎంపిటిసి చుక్క ఈశ్వరమ్మ మాట్లాడుతూ, చిప్పాడలో అధికార పార్టీకి చెందిన సర్పంచ్ భర్త కనుసన్నల్లో అర్ధరాత్రి వేళ గ్రావెల్ తరలించుకు పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. దీనిపై తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ స్పందిస్తూ, దీనిపై సంబంధిత వ్యక్తికి పలుమార్లు హెచ్చరించామన్నారు. సభలో ఉన్న సర్పంచ్ భర్త కలుగజేసుకుని, గ్రావెల్ అమ్ముకోవడం లేదని, పక్క పంచాయతీలో కొందరికి అవసరమైతే ఉచితంగానే గ్రావెల్ పంపిస్తున్నట్లు సర్పంచ్ భర్త వివరణ ఇచ్చారు. తాళ్లవలస ఎంపిటిసి కోరాడ రమణ (టిడిపి) మాట్లాడుతూ, అధికారులు గానీ, కొందరు వైసిపి ప్రజాప్రతినిధులు గానీ ప్రొటోకాల్ పాటించడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, నాలుగేళ్లలో మండలంలో రూ 384 కోట్ల మేర సంక్షేమ పథకాలు అందజేసినట్లు వివరించారు. జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, వైస్ ఎంపిపిలు బి బంగారునాయుడు, ఎస్ దుర్గాలమ్మ, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్య నారాయణ, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పెదబాబు, ఎంపిడిఒ పి వెంకటరమణ, సర్పంచ్ చిల్లారి పైడప్పడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

ప్రజా సేవకుడు కృష్ణమూర్తి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

కృష్ణమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నర్సింగరావు

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రజా సమస్యలపై నిరంతరం అలుపెరగని పోరాటం చేసిన ప్రజా సేవకుడు వి.కృష్ణమూర్తి అని సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిహెచ్.నర్సింగరావు కొనియాడారు. ఆరిలోవకు చెందిన సిపిఎం సీనియర్ నేత, పార్టీ జిల్లా కార్యాలయ అకౌంటెంట్ కృష్ణమూర్తి హఠాన్మరణం నేపథ్యంలో ఆ కుటుంబ సభ్యులను సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ స్థానిక నాయకులతో కలిసి నర్సింగరావు పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ కృష్ణమూర్తి మరణం అతని కుటుంబానికే కాకుండా, పార్టీకి, ఈ ప్రాంత ప్రజా ఉద్యమానికి తీరని లోటన్నారు. కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆరిలోవ ఆవిర్భావం నుంచి ఈ ప్రాంతంలో పార్టీని, ప్రజా సంఘాలను నిర్మించడంలో కృష్ణమూర్తి కృషి మరువలేనిదన్నారు. కృష్ణమూర్తితోపాటు ఆయన భార్య అన్నపూర్ణ ఐద్వా సంఘంలోనూ, పార్టీలోనూ కీలక పాత్ర పోషించారన్నారు. నిరాడంబరమైన జీవితం, పిల్లలిద్దరికీ కులాంతర వివాహాలు చేసే ఆదర్శభావాలు, మరణించాక తన కళ్లను వేరొకరి కంటిచూపు కోసం, దేహాన్ని వైద్యవిద్యార్థుల పరిశోధనల కోసం అందించిన ఆదర్శనీయుడని కొనియాడారు. దోపిడీ లేని సమాజం నిర్మించడం కృష్ణమూర్తి సిద్ధాంతమని, అటువంటి ఆశయసాధన కోసం అందరం పనిచేయడమే ఆయనకిచ్చే ఘననివాళి అన్నారు. నర్సింగరావుతోపాటు స్థానిక సిపిఎం నేతలు వి.నరేంద్రకుమార్, పి.శంకర రావు, కె.సత్యనారాయణ, సన్యాసిరావు ఉన్నారు.

జిల్లా టాపర్‌గా రితిక

ఇంటర్ ఫలితాల్లో గురుద్వార్ 'నవోదయ' విద్యార్థుల ప్రతిభ

ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న నవోదయ ప్రతినిధులు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఇంటర్ పరీక్ష ఫలితాల్లో గురుద్వార్ దరి శ్రీనవోదయ జూనియర్ కాలేజీ విద్యార్థిని కె.రితిక 990మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచిందని కళాశాల కరస్పాండెంట్ భీశెట్టి రాము, డీన్ భీశెట్టి ప్రసాద్ తెలిపారు గురువారం కళాశాల ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ తమ కాలేజీ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచారన్నారు. సెకెండియర్ ఇంటర్ ఫలితాల్లో కె. రితిక 990/1000 జిల్లాలో మొదటి స్థానంలో నిలవగా, జె.సుకాయ 981, శృతి పట్నాయక్ 980, బైపీసీలో భార్గవి 980, సాయి చందనశ్రీ 978 సత్తా చాటారన్నారు. జూనియర్ ఇంటర్ ఎంపిసిలో శ్రీనిధి 464/470 టి..సాత్విక 462 రాణి 461, జూనియర్ బైపీసీలో ఆర్.అన్విత 430/440, తాయభ 430, హర్షవర్ధన్ 427 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ ప్రతిభలో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, అధ్యాపకుల కృషి ఎంతో ఉందన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

'శశి' విద్యార్థుల విజయదుందుభి

ప్రజాశక్తి- తగరపువలస : ఇంటర్ ఫలితాల్లో సంగివలస శశి విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచినట్లు శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపిసిలో బి సాయిప్రణీత 988మార్కులు, కె తేజ భరత్ 987, ఇ గౌతమ్, కె వి ఎస్ చైతన్య , పి నాగసాయి నిఖిత, బి.చరణ్ 986మార్కులు సాధించారన్నారు. 980 పైబడి మార్కులను 37మంది, 970 పైబడి 91 మంది, 950 పైబడి 180 మంది సాధించారని తెలిపారు.బైపిసిలో సిహెచ్.హర్షవర్ధన్ 988 మార్కులుతో టాపర్‌గా నిలవగా, పిడి శివనాయుడు 986 మార్కులు సాధించాడు. 980మార్కులు పైబడి 11 మంది , 970 పైన 25 మంది, 950 పైన 62 మంది సాధించారన్నారు

జూనియర్ ఇంటర్‌లోనూ అదే హవా!

జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో 470 మార్కులకుగాను వై ప్రశాంతి, టిపివిఎస్ నాగసాయి రామ్, పి పూజితరామ్, సిహెచ్ హరి సాత్విక, పివి వర్ధన్ 465 మార్కులు సాధించారని తెలిపారు . 460 మార్కులు పైబడి 85మంది, 450మార్కులు పైన 218 మంది మార్కులు సాధించారన్నారు. బైపిసి విభాగంలో 440 మార్కులకు కెటి షణ్ముఖశ్రీ, బి.శ్రీవల్లి, వై తేజశ్రీ 435 మార్కులు సాధించారని తెలిపారు 430 మార్కులు పైబడి 19 మంది, 400పైన మార్కులు 81 మంది సాధించినట్లు వివరించారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన విద్యార్థులు, అధ్యాపకులను అకడమిక్ డైరెక్టర్ మేకా క్రాంతిసుధ అభినందించారు

ఇంటర్ ఫలితాల్లో గిరిజన విద్యార్థుల ప్రతిభ

కాలేజీ టాపర్స్‌గా నిలిచిన మనోహర్, ధారకృష్ణ, డేవిడ్‌రాజు

ప్రజాశక్తి- మధురవాడ : ఇంటర్ ఫలితాల్లో గిరిజన విద్యార్థుల ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శివప్రసాద్ తెలిపారు. పాడేరు ఐటిడిఎ ఆధ్వర్యంలో మారికవలసలో ఐఐటి,నీట్, లాసెట్ శిక్షణ పొందుతున్న తమ కాలేజీ విద్యార్థులు 96 మంది ఇంటర్ పరీక్షలకు హాజరుకాగా, వారిలో 94 మంది ఉత్తీర్ణులై , 98శాతం ఫలితాలు సాధించామన్నారు. ఎంపిసి విద్యార్థి మనోహర్ 952 మార్కులతో కాలేజీ టాపర్‌గా నిలవగా, బైపిసిలో బి.ధారకృష్ణ 947, ఆర్ట్స్ కేటగిరిలో బి. డేవిడ్‌రాజు 901 మార్కులతో టాపర్లుగా నిలిచారన్నారు. 96మందిలో 10 మంది విద్యార్థులకు 900కు పైబడి మార్కులు వచ్చాయన్నారు. విద్యార్థులను పిఒ వి.అభిషేక్, గిరిజన సంక్షేమ డిడి కొండలరావు అభినందించారన్నారు.

ఆటోనగర్‌లో ప్రారంభమైన బిజినెస్ ఎక్స్‌పో

జ్యోతిప్రజ్వలనతో ఎక్స్‌పో ప్రారంభిస్తున్న పరిశ్రమల జిఎం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్‌లో ఫ్లోరిస్ క్రియేషన్ ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్, బిజినెస్ ఎక్స్‌పోను గురువారం ప్రారంభించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సిహెచ్ గణపతి జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించిన ఎక్స్‌పోలో రాష్ట్రంలోని వివిధ కంపెనీల ఉత్పత్తులను ఇక్కడ వందస్టాల్స్‌లో ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న మధ్యతరహా పరిశ్రమలను ఆదుకోవడానికి అనేక రాయితీలు కల్పిస్తున్నాయన్నారు. సందేహాలుంటే తమ కార్యాలయానికి వచ్చి నివృత్తి చేసుకోవచ్చన్నారు. వాసవి ప్రధాన కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ, చిన్న పరిశ్రమలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.. ఎంఎస్ఎంఇ ఎడి చంద్రమౌళి మాట్లాడుతూ, గతంలోనూ ఇలాంటి ఎక్స్‌పోలను ఏర్పాటు చేశామని, వీటివల్ల పరిశ్రమల యజమానులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల యజమానులు కృష్ణప్రసాద్, వై సాంబశివరావు పాల్గొన్నారు.

ముకుందపురంలో
ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలు

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని ముకుందపురంలో భీమిలి వైద్యాధికారిణి డాక్టర్ వై.దుర్గా కల్యాణి ఆధ్వర్యంలో గురువారం ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్యశిబిరం నిర్వహించారు. సర్పంచ్ కలిమి గంగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 76 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక సమస్యలున్న వారికి పరీక్షలు నిర్వహించి, సూచనలు చేశారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న కొట్ల సన్యాసిరావు ఇంటికి వెళ్లి వైద్యసూచనలు చేశారు. అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించి, పిల్లలకు ఆరోగ్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో దొంతల శ్రీను, సామాజిక ఆరోగ్య అధికారి పి. సాంబమూర్తి, ఆరోగ్య కార్యకర్తలు మెట్ట దేవి, ఆర్. నాగేశ్వరరావు, సిహెచ్ఒ పైల స్వర్ణలత, ముద్దాడ మానస, ఆశా కార్యకర్తలు పల్లి ఆదిలక్ష్మి, రేగాని పైడిరాజు, ఎస్.మంగ, వరుపుల దేవుడమ్మ పాల్గొన్నారు.

రవీంద్రనగర్‌లో
మజ్జిగ చలివేంద్రం

ప్రజాశక్తి - ఆరిలోవ : మండుటెండల్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు రవీంద్రనగర్ సేవాస్ఫూర్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఓం సాయిరాం కేటరింగ్ ప్రొప్రయిటర్ కాకి గంగరాజు ఆర్థిక సాయంతో ప్రతి రోజూ మజ్జిగ, మధ్యాహ్నం చల్లని నీరు అందించేలా చలివేంద్రాన్ని ప్రారంభించారు. పాదచారులకు, ప్రయాణికులకు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు, సభ్యులు, రవీంద్రనగర్ గ్రామ సంఘం పెద్దలు వి.శ్రీనివాసరావు, ఎంపి పాత్రుడు, అధ్యక్షులు సత్యనారాయణ పాల్గొన్నారు.

విశాఖలో చిత్రీకరించిన సినిమాలన్నీ హిట్!

క్లాప్ కొడుతున్న దేవన్‌రెడ్డి, సత్యనారాయణ

ప్రజాశక్తి- ఉక్కునగరం : విశాఖలో చిత్రీకరించిన సినిమాలన్నీ హిట్ అవ్వడం ఖాయమని వైసిపి గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ అన్నారు. గురువారం దువ్వాడ సెక్టర్-1, రామాలయంలో వరలక్ష్మి క్రియేషన్స్ బ్యానర్‌పై 'నేను ఆ అమ్మాయిని ప్రేమించాను, కానీ' సినిమా ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు విశాఖలో నిర్మించిన సినిమాలన్నీ మంచి ప్రేక్షకాదరణ పొందాయని, ఈ సినిమా కూడా విజయం సాధించి, నిర్మాతకు మంచి లాభాలతో నటీనటులు, సాంకేతిక నిపుణులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. చిత్ర యూనిట్‌కు సహ నిర్మాతలు గుడివాడ శ్రీనివాసరావు, ఎస్ఎస్ఎన్. ప్రసాదరావు, రాజు, నారాయణరావు, పైడిరాజు, విజయ్‌కుమార్, చలపతిరావులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాల నాయుడు, దువ్వాడ సిఐ. శ్రీనివాసరావు, హీరో బొత్స రామ్, సుమల, మౌర్య కర్లిక, ఎపి మా అసోసియేషన్ కార్యదర్శి వై.అప్పారావు, సినీ ఆర్టిస్ట్ సముద్రం వెంకటేష్, చంద్రశేఖర్, హీరోయిన్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిజెసిలో తగ్గిన ఉత్తీర్ణతా శాతం

ప్రజాశక్తి - భీమునిపట్నం : ఇంటర్ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణతాశాతం తీసికట్టుగా ఉంది. ఫస్టియర్‌లో 26.72శాతం ఉత్తీర్ణత సాధించగా, సెకెండియర్‌లో 32.10 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సెకెండ్ ఇంటర్‌లో 168 మంది విద్యార్థులకు గాను 64 మంది ఉత్తీర్ణులయ్యారు. బైపిసిలో సిహెచ్ మంజుల 980 మార్కులతో కాలేజీ టాపర్‌గా నిలవగా, ఎంపిసిలో ఎం.మనోజ్ కుమార్ 960 మార్కులు సాధించాడు. గతేడాది ఉత్తీర్ణతాశాతం 61తో పోల్చుకుంటే, ఈ ఏడాది సగం శాతమే సాధించారు.

ఇక ఇంటర్ ఫస్టియర్‌లో 131 మంది విద్యార్థులకు గాను 35 మంది (26.72 శాతం) ఉత్తీర్ణత సాధించారు. బైపిసిలో జిఇ నాయుడమ్మకు అధికంగా 414 మార్కులు వచ్చాయి. గతేడాది ఇంటర్ ఫస్టియర్‌లో 40శాతం ఉత్తీర్ణతతో పోల్చుకుంటే సగం కంటే కొంచం ఎక్కువ ఉత్తీర్ణత నమోదైంది.

అమృతరావుకు ఘననివాళి

ప్రజాశక్తి- ఉక్కునగరం : విశాఖ ఉక్కు సాధకులు, స్వాతంత్ర సమరయోధులు, మాజీ ఎమ్మెల్యే తమనంపల్లి అమృతరావు 34వ వర్ధంతి సందర్భంగా స్టీల్‌ప్లాంట్ హిల్ టాప్ గెస్ట్ హౌస్ వద్ద అమృతరావు విగ్రహానికి ప్లాంట్‌లో పలు యూనియన్‌లు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఆవిర్భావం కోసం ఆమరణ దీక్షతో తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి అమృతరావు అని గాంధీ మిషన్ కన్వీనర్ ఎవి రమణరావు కొనియాడారు. ప్రాణత్యాగాలతో సాధించిన స్టీల్‌ప్లాంట్‌ను, అవసరమైతే అమృతరావు స్ఫూర్తితో మళ్లీ ప్రాణత్యాగాలతోనే ప్రైవేటుపరం కాకుండా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఇంటక్ అధ్యక్షులు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. కార్యక్రమంలో జెర్రిపోతుల మోహన్‌కుమార్, కోరాడ వెంకటరావు, కారు రమణ, బొండా ఎల్లాజీరావు, విల్లా రాంమోహన్‌కుమార్, పరంధామయ్య, నీలాటి రాజు, పల్లా పెంటారావు, డి మధు, వీరబాబు, దుప్పాడ అప్పారావు, కొణతాల కృష్ణమోహన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లక్ష్మీబాయి

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక సిఐటియు నేత కణితి అప్పలరాజు తన కుమారుడు దుర్గాప్రసాద్ శివ ఆరో వర్ధంతిని పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థం గురువారం సీతానగరం ప్రభుత్వ పాఠశాలలోని 66మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, పులి రమణారెడ్డి మాట్లాడుతూ, తన కొడుకు జ్ఞాపకార్థం అప్పలరాజు ఏటా మంచి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు.

కార్యక్రమంలో సిఐటియు నేతలు శ్రీనివాస రాజు, నమ్మి రమణ, నమ్మి అప్పారావు, కెవి రమణ, ఒబిసి సీమసిరి శ్రీను, ముద్దుర్తి శ్రీరామమూర్తి, హెచ్ఎంఎస్ దొమ్మేటి అప్పారావు, కొవిరి అప్పలరాజు, పాలు వెంకయ్య, నమ్మి అప్పలనాయుడు, కుదాసి వంశీ, హరి, ఎం సాంబ, రాయల్ లక్ష్మణరావు, గంగాధర్, నక్క అప్పారావు, దేశెట్టి అప్పారావు, సిహెచ్ ఈశ్వరరావు, ఎన్ వెంకటేష్, కెవి చారి తదితరులు పాల్గొన్నారు.

118 బోర్లకు మరమ్మతులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : సమ్మర్ క్రాష్ ప్రోగ్రాం లో భాగంగా ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో 118 చేతి పంపులకు మరమ్మతులు చేసినట్లు ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ దుర్గాంబ తెలిపారు. భీమిలి మండలంలో 609 బోర్లకుగాను 15, ఆనందపురంలో 851కి 59, పద్మనాభంలో 676 బోర్లకుగాను 44బోర్లకు మరమ్మతులు చేసినట్లు తెలిపారు.

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన

బిజెపి ఎంపీని అరెస్టు చేయాలి

ప్రజా సంఘాల ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

మహిళా రెజ్లింగ్ క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షులు, బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌ను అరెసు చేయాలని కోరుతూ సిఐటియు, ఐద్వా, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించాల్సిన ప్రజా ప్రతినిధులు దేశానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చిన మహిళా క్రీడాకారులను వేధించడం దుర్మార్గమన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ కరువైందన్నారు. దేశానికి పతకాలు తెచ్చిన మహిళా రెజ్లర్లు మహిళా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన కేసు నమోదు చేయలేదని, నిందితులను అరెస్టు చేయలేదని పేర్కొన్నారు. తక్షణమే రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్ష పదవి నుంచి బ్రిజ్ భూషణ్‌ను తొలగించాలని, ఆయన పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలని నాలుగు రోజులుగా రెజ్లర్లు ఆందోళన చేస్తున్నా బిజెపి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్నా కేసు నమోదు చేయకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ, తరుణ్, ఐద్వా నాయకురాలు సుభాషిణి, డివైఎఫ్ఐ నాయకులు శివాజీ, మౌనిక, జన విజ్ఞాన వేదిక నాయకులు బి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలిలో ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఇంటర్ ఫలితాల్లో కెజిబివి విద్యార్థినుల ప్రభంజనం

91 శాతంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రథమ స్థానం

ప్రజాశక్తి-వడ్డాది

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో బుచ్చయ్యపేట మండలం వడ్డాది కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజీబీవీ) విద్యార్థినులు ప్రభంజనం సృష్టించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 36 మంది విద్యార్థినులకు గాను 33 మంది ఉత్తీర్ణులై 91 శాతం ఉత్తీర్ణతతో కెజిబివిల్లో ఈ విద్యాలయం ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఎర్రంశెట్టి రాణి 964 మార్కులతో ప్రథమ స్థానం సాధించగా, సుంకర ధనలక్ష్మి 963తో ద్వితీయ స్థానం, 958 మార్కులతో అద్దేపల్లి ఝాన్సీ, గాడి భారతిలు తృతీయ స్థానాల్లో నిలిచారు. 13 మంది విద్యార్థినులు 900 మార్కులు పైబడి సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఈ విద్యాలయానికి చెందిన 36 మంది విద్యార్థినులకు గాను 26 మంది ఉత్తీర్ణులై 68.8 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. వీరిలో మడిసి నాగమ్మ 415 మార్కులతో మొదటి స్థానం, పత్తి లత 410తో ద్వితీయ స్థానం, నైదనా జ్యోతి 405తో తృతీయ స్థానం సాధించారు. ఆరుగురు విద్యార్థినులు 400 పైబడి మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, విద్యాలయం ప్రిన్సిపాల్ అన్నపూర్ణకు జిల్లా విద్యశాఖాధికారి వెంకట లక్ష్మమ్మ, ఎంఇఒ చంద్రశేఖర్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

కెజిబివి విద్యార్థుల సత్తా

కోటవురట్ల : మండలంలో కేజీబీవీ పాఠశాల విద్యార్థునులు సత్తా చాటారు. మొదటి సంవత్సరంలో 16 మంది హాజరు కాగా విద్యార్థులు 13 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 17మంది హాజరు కాగా 14 ఉత్తీర్ణత సాధించారని ప్రత్యేక అధికారి సరితా దేవి తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు రేఖ అనురాధ 92.5శాతం, శీతల భవాని 82.9శాతం, షేక్ రజియాబేగం 82.5శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, కెఆర్ఎస్ రిషిత 92.4శాతం, పెట్ల రవణమ్మ 88.6శాతం, కన్నురు భవాని 83.5శాతం సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

జిల్లాలో ఉషోదయ విద్యార్థి ప్రథమ స్థానం

చోడవరం : ఇంటర్మీడియట్ ఫలితాల్లో చోడవరం ఉషోదయ జూనియర్ కాలేజీ విద్యార్థిని డి.లీల ఎంపీసీలో 988/1000 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానం దక్కించుకుంది. మానస 987, ఎస్‌కె.అమితా భాను 985, మరో ఆరుగురు మంచి మార్కులు సాధించారు. 28 మంది విద్యార్థులు 900 పైబడి మార్కులు సాధించారు. వారిని కళాశాల చైర్మన్ జె.రమణాజీ, కరెస్పాండెంట్ కృష్ణకుమారి, డీన్ వెంకట వాసు తదితరులు అభినందించారు.

అభినందిస్తున్న రమణాజీ

ప్రథమ స్థానంలో శ్రావ్య

బుచ్చయ్యపేట : ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మండలంలోని వడ్డాదికి చెందిన సిరిగిరిశెట్టి శ్రావ్య 978/1000 మార్కులు సాధించి బుచ్చయ్యపేట మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఓ ప్రైవేట్ కళాశాలలో ఈమె ఇంటర్ చదివింది. తల్లిదండ్రులు వ్యవసాయ కుటుంబమైనప్పటికీ శ్రావ్య చిన్నప్పటినుండి చదువులో రాణిస్తూ వస్తోంది. ఇంటర్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడంపై కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఐఐటీలో సీటు సాధించి బీటెక్ చేయాలన్నదే తన లక్ష్యమని శ్రావ్య తెలిపింది.

ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన ఫలితాలు

కొత్తకోట : ఇంటర్ ఫలితాల్లో కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఈ ఏడాది కాస్త మెరుగైన ఫలితాలు సాధించింది. గత మూడేళ్లు గా ఈ కళాశాలలో ఫలితాలు ఆశాజనకంగా లేవు. గత ఏడాది ఇంటర్ సెకెండ్ ఇయర్ 36.32, ఫస్ట్ ఇయంలో 16.53 ఫలితాలు సాధించగా ఈ ఏడాది సెకెండ్ ఇయర్ 61.21, ఫస్ట్ ఇయర్ 43.59 లతో కాస్త మెరుగైన ఫలితాలు సాధించారు. ఇంటర్ సెకెండ్ ఇయర్‌లో వి.కళ్యాణ్, ఎంపిసి 908, కె. శ్రావణి బైపిసి 904, టి.సరోని రాణి హెచ్ఈసి 901, సిహెచ్ సతీష్ సిఈసి 898 మార్కులు సాధించి కళాశాల ప్రథమ స్థానంలో నిలిచారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఫలితాలలో ఆర్.హారిక ఎంపిసి 407(470), జి.కొండాజి హెచ్ఈసి 448(500), వి.ఇందిరా ప్రియదర్శిని బైపిసి 382(440), పి.పాండు సిఈసి 366(500), పి లక్ష్మి భార్గవి ఒకేషనల్ లో 442(500) మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి సాయికుమార్ మాట్లాడుతూ, సిలబస్ కఠినంగా ఉన్నప్పటికీ అధ్యాపకుల కృషి ఫలితంగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని పేర్కొన్నారు.

కైట్స్ కళాశాల ఉత్తమ ఫలితాలు

అచ్చుతాపురం : ఇంటర్మీడియట్ ఫలితాలలో స్థానిక కైట్స్ కళాశాల ఉత్తమ ఫలితాలు సాధించింది. ఈ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థి పి.శివకుమార్ 978 మార్కులు, బి.భార్గవి 972, బి.గిరీష 963, ఎం.అశ్రిత 937, వై.ధనలక్ష్మి 925, ఎం.భీమేశ్వరరావు 924, కె.వరలక్ష్మి 913 సాధించారు. కె.నంద మౌనిక, ఎస్.నాగేశ్వరి, డి.పుష్పశ్రీ అధిక మార్కులు సాధించిన వారిలో ఉన్నట్లు కైట్స్ కళాశాల కరస్పాండెంట్ రెడ్డి

శివ కుమార్

కె.తేజస్వి,

భవాని

మోడల్ స్కూల్‌లో 59.62 శాతం ఉత్తీర్ణత

రావికమతం : మండలంలో మరుపాక ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్లో 104 మంది విద్యార్థులకు గాను 62 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 59.62శాతం ఉత్తీర్ణత సాధించింది. ఫస్ట్ ఇయర్ కి సంబంధించిన విద్యార్థిని కే.తేజస్వి ఎంపీసీ 454 మార్కులు సాధించి కాలేజి ప్రథమ స్థానంలో నిలిచింది. రమ్యశ్రీ ఎంపీసీ 437, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 87 మంది విద్యార్థులకు గాను 66 మంది ఉత్తీర్ణత సాధించి 75.86 శాతం కాలేజీ ఉత్తీర్ణత సాధించింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో కే భవాని శిరీష 944 మార్కులు, గిరిజ బైపీసీ 934 సాధించారు. గత ఏడాది ఫస్ట్ ఇయర్లో 35శాతం సాధించగా ఈ ఏడాది 59.62శాతం సాధించారు. గత ఏడాది సెకండ్ ఇయర్‌లో 46శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది 75.86శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె సునీల్ తెలిపారు.

రమ్యశ్రీ,

గిరిజ

గొలుగొండ : ఇంటర్మీడియేట్ ఫలితాల్లో గొలుగొండ మండలం కేడిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గంగరాజు మాట్లాడుతూ, రెండవ ఎంపిసిలో పైల హిమబిందు 931/1000 మార్కులు సాధించిందన్నారు. రెండవ బైసిపిలో చింతకాయల జాహ్నవి 927, విజయశ్రీ 915, రెండవ సిఇసిలో శివ 851 సాధించారన్నారు. మొదటి సంవత్సరంలో తేవిష్య 446/470, రామోజు భారతి 443 సాధించారన్నారు. గొలుగొండ బాలయోగి గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్‌లో 66.7 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో అల్లు గిరిబాబు 447(ఎంపిసి) కళాశాల టాపర్‌గా నిలిచారు. రెండవ సంవత్సరం ఫలితాల్లో ఎస్.రాజేష్ 887 కళాశాల టాపర్‌గా నిలిచారు.

హిమబిందు

ఈదురుగాలులతో భారీ వర్షం

- తాటి చెట్టు విరిగి పడి తెగిన విద్యుత్ వైర్లు
- పిడుగు పాటుకు పాడి ఆవు మృతి

ప్రజాశక్తి- వడ్డాది

బుచ్చయ్యపేట మండలం వడ్డాది పరిసర ప్రాంతంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం రెండు గంటల వరకు భానుడు ప్రతాపం చూపించగా తరవాత ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. నాలుగు గంటల నుండి గాలివాన ప్రారంభమైంది. ఉరుములు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల కారణంగా బంగారుమెట్టలోని ఫామ్ ఆయిల్ వద్ద తాటి చెట్టు ఒరిగి విద్యుత్ స్తంభంపై పడి వైర్లు తెగి పడ్డాయి. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఉరుములతో పిడుగు పడి బంగారుమెట్ట గ్రామంలో బత్తుల నానాజీ చెందిన పాడి ఆవు మృత్యువాత పడింది. రూ.70 వేలు విలువ చేసే ఆవు చనిపోవడంతో బాధిత రైతు లబోదిబోమంటున్నాడు. ప్రభుత్వం ఇన్సూరెన్స్ స్కీము నిలిపివేయడంతో పరిహారం అందే అవకాశం లేకుండా పోయింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

లోకో యాప్ ద్వారా ఆర్థిక లావాదేవీలపై శిక్షణ

ప్రజాశక్తి- కశింకోట : లోకో యాప్ ద్వారా ఆర్థిక లావాదేవీలపై స్థానిక వెలుగు కార్యాలయంలో 47 మంది విఒఎలకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య ఎపిఓ ఎమ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలోని స్వయం సహాయక సంఘాల్లో జరిగే ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత సభ్యులు వివరాలు ఈ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. సంఘాల్లో పొదుపులు, అప్పులు, సభ్యుల జీవనోపాధి, స్థితిగతులు ఆదాయాభివృద్ధి వంటి వివరాలు ఇందులో నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య కార్యదర్శి లక్ష్మి, విఒఎలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ సూచించారు. మండలంలోని మూలపేట గ్రామంలో ఏర్పాఉ చేసిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని గురువారం సర్పంచ్ భీశెట్టి గంగ అప్పల నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా గ్రామాల్లోని ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువయ్యాయని తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తగరంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపిపి గొర్లి సూరిబాబు ఆదేశించారు. గురువారం ఎంపిపి అధ్యక్షతన పిహెచ్‌సి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణ లోతట్టుగా ఉండడంతో వర్షపు నీరు నిల్వ ఉంటుందని, దానిని ఎత్తు చేయాలని, ఆపరేషన్ థియేటర్లో ఏసీ ఏర్పాటు చేయాలని, చెద నివారణకు చర్యలు చేపట్టాలని, కిటికీలకు మెస్ ఏర్పాటు చేయాలని సర్పంచ్, ఎంపిటిసి కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే ధర్మారావు, వైద్యులు రమేష్ నాయుడు, సర్పంచు యాదగిరి అప్పారావు, సుంకర చంటి, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ జంపాన శివాజీ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో తనిఖీ

మండలంలోని కూండ్రం గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని ఎంపీపీ గొర్లి సూరిబాబు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. మెనూ ప్రకారం వంట చేయని అంగన్వాడీ వర్కర్, నాలుగు రోజులుగా బాలింతలు, గర్భిణుల హాజరు నమోదు చేయని అంగన్వాడీపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో ధర్మారావు, ఏసి డిపిఓ శశికళ, గ్రామ వైసిపి నాయకులు సేనాపతి పెంటారావు, ఎలమంచిలి చిన్న రమణ, కనుబుడ్డి శంకర్రావు ఉన్నారు.

రైతులు భూ సార పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : వ్యవసాయం చేస్తున్న ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు తెలిపారు. మండలంలోని సింగన్న దొర పాలెం గ్రామంలో గురువారం భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. భూసార పరీక్ష వలన భూమి యొక్క సారాన్ని తెలుసుకోవచ్చని చెప్పారు. ఈ పరీక్షల ఆధారంగా అవసరమైన ఎరువులను రైతులు వేసుకోవచ్చని, దీనివలన తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు వందన. స్నేహలత. తేజస్వి జయ. పుష్పమాంజలి పాత్రో పాల్గొన్నారు.

గంటికొరకంలో నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం కోమల్లపూడి సచివాలయం పరిధి గంటి కొరకంలో గురువారం వైఎస్ఆర్ కంటి వెలుగు పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్యులు డాక్టర్ ఆర్ వెంకట్రావు ఆధ్వర్యంలో 260 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు అందులో 24 మందికి మే మొదటి వారంలో ఆపరేషన్ చేస్తామని తెలిపారు. 84 మనిషికి కళ్లద్దాలు పంపిణీ చేస్తామన్నారు. మిగిలిన వారికి మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇందులో పాల్గొన్న గంటికొరకం సర్పంచ్ సరకాన బాబురావు మాట్లాడుతూ వైఎస్ఆర్ కంటి వెలుగుతో జీవితం మరింత సుఖమయం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుభాషిణి, పాల్గొన్నారు.

30న వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-సబ్బవరం : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా పాలిశెట్టి సురేష్ ఈ నెల 30న ప్రమాణ స్వీకారం చేయనున్నారని, ఈ సందర్భంగా సబ్బవరం జోడిగుళ్ల ప్రాంతంలో బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు జెడ్‌పి వైస్ ఛైర్మన్ తుంపాల అప్పారావు, ఎంపీపీ బోకం సూర్యకుమారి రాము నాయుడు, వైసిపి నాయకులు తెలిపారు. గురువారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ బహిరంగ సభకు వైసిపి యువజన విభాగం రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షులు సిద్ధార్థ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, మంత్రి గుడివాడ అమర్నాథ్, పార్టీ జిల్లా పార్టీ అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ, స్థానిక ఎమ్మెల్యే అదీప్ రాజ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున యువజన కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైసిపి మండల అధ్యక్షుడు కర్రి బాబు, నాయకులు సబ్బవరం నారాయణమూర్తి, వనం అచ్చు నాయుడు, వైస్ ఎంపీపీ శరగడం రాము, బోను గంగు నాయుడు, బలిరెడ్డి కనకరాజు పాల్గొన్నారు.

నూతన పాల్జీ బ్రిక్స్ మిషనరీ ప్రారంభం

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : మండల కేంద్రం మునగపాకలో శ్రీచక్ర పాలజీ బ్రిక్స్ అధినేత ఆడారి అప్పలనాయుడు నూతనంగా కొనుగోలు చేసిన మిషనరీని గురువారం విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, ఏపీ గవర కార్పొరేషన్ ఛైర్మన్ బొడ్డేడ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పలనాయుడు వ్యాపార రంగంలో ఒక ప్రత్యేక స్థానాన్ని గుర్తింపుని సొంతం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు, జెడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఎంపిటిసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, ఆడారి గణపతి అచ్చం నాయుడు, పెంటకోట విజయ్, దాడి శివ, టెక్నల పరశురాం పాల్గొన్నారు.

అర్హులకు మిషన్ వాత్సల్య వర్తింపజేస్తాం

ప్రజాశక్తి-దేవరాపల్లి : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ మిషన్ వాత్సల్య పథకానికి వర్తింపజేసేలా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని అనకాపల్లి జిల్లా ఐసిడిఎస్ పిడి జి.ఉషారాణి తెలిపారు. మండలంలోని మారేపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం ఆమె సిడిపిఒ వి.మంగతాయారుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టికను, హాజరైన విద్యార్థుల సంఖ్యను పరిశీలించారు. స్టాక్ రికార్డులు, సరుకులు నిల్వలను చూశారు. అనంతరం కొత్తపెంటలో స్థానిక సర్పంచ్ రొంగలి వెంకటరావుతో కలిసి నూతన అంగన్వాడీ భవనాల నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. దేవరాపల్లిలో కూడా అంగన్వాడీ సెంటర్ -6 భవనానికి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ జిల్లాలో మిషన్ వాత్సల్య పథకానికి ఇప్పటివరకు 4,500 దరఖాస్తులు వచ్చాయని, అర్హులు ఇంకా మిగిలి ఉంటే ఈ నెలాఖరులో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట అంగన్వాడీ సూపర్వైజర్లు, కార్యకర్తలు ఉన్నారు.

30న బి.కింతాడలో వైఎస్ఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని బోయిల కింతాడ గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఈ నెల 30న ఆవిష్కరించనున్నట్లు స్థానిక సర్పంచ్, వైసీపీ మండల అధ్యక్షులు బూరె బాబురావు తెలిపారు. వైసిపి రీజనల్ కో ఆర్డినేటర్ వై వి సుబ్బారెడ్డి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు వైయస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక నాయకులతో కలిసి ఏర్పాట్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ భవనాలను ప్రారంభిస్తారని, రూ.20 కోట్లు వ్యయంతో కాశీపురం- బి.కింతాడ రోడ్డు విస్తరణకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. గవరవరం రెవిన్యూ పరిధిలో రూ.15 కోట్లతో నిర్మించిన వంతెనను ప్రారంభిస్తారని తెలిపారు.

లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని శిక్షించాలని ధర్నా

ర్యాలీ చేస్తున్న మహిళలు, గ్రామస్తులు

ప్రజాశక్తి-చోడవరం : చీడికాడ మండలం వరహాపురం గ్రామానికి చెందిన ఎలమంచిలి లక్ష్మి అనే మహిళాపై లైంగిక దాడికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన ఎలమంచిలి చిన్నను కఠినంగా శిక్షించి, బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో గురువారం చోడవరం పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.వరలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 13న లక్ష్మిపై శారీరకంగా, లైంగికంగా ఎలమంచిలి చిన్న దాడికి పాల్పడ్డాడని, దీనిపై బాధితురాలు చీడికాడ పోలీసులకు చేసిందని తెలిపారు. దీనిపై పోలీసులు తూతూ మంత్రంగా దర్యాప్తు జరిపి నిందితునికి స్టేషన్ బెయిల్ ఇచ్చే వదిలిపెట్టడం దారుణమన్నారు. నిందితునిపై నిర్భయ, దిశ చట్టాల కింద కేసులు పెట్టి వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. సంఘటన జరిగి 15 రోజులైనా పోలీసులు నిందితుడిని దాసిపెట్టి, ఆయన అందుబాటులో లేడని చెప్పడం దారుణమన్నారు. పోలీసులు వెంటనే చర్యలు తీసుకొని, బాధితురాలి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఆర్.దేముడు నాయుడు, బాధితురాలు భర్త ఎలమంచిలి రాము, ఎలమంచిలి ఎర్రయ్య, ఎలమంచి మల్లమ్మ, వెంకటలక్ష్మి, నాగిరెడ్డి సత్యనారాయణ, మిస్క సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

పిఎఫ్ మంజూరు చేయాలని జీడిపిక్కల కార్మికుల నిరసన

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లాలో మునగపాక మండలం రాజుపేట ఇండియా ఫుడ్ జీడి పిక్కల కంపెనీ కార్మికులకు పీఎఫ్ మంజూరు చేయడంలో జాప్యాన్ని అరికట్టాలని కోరుతూ గురువారం అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పేర్లు, వయసు తదితర నమోదులో జరిగిన పొరపాట్లు సరిచేసి తమకు రావాల్సిన పిఎఫ్ ఇవ్వాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ జీడిపిక్కల కంపెనీ యాజమాన్యం కార్మికులకు చెల్లించాల్సిన పీఎఫ్ సొమ్ము తక్షణమే చెల్లించాలన్నారు. కార్మికులకు ఇబ్బందులకు గురి చేస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. పిఎఫ్ ఆదాలకు హాజరైన అధికారులకు సమస్యలతో కూడిన వినత పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మునగపాక మండల నాయకులు ఆళ్ళ మహేశ్వరరావు, ఎస్ బ్రహ్మాజీ, మహలక్ష్మి, రమణమ్మ అరుణ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న జీడిపిక్కల కార్మికులు, సిఐటియు నాయకులు

ఏటికొప్పాక కొయ్యబొమ్మల వీడియోకు ద్వితీయ స్థానం

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం అధ్యాపకురాలు డాక్టర్ నీలిమ బోగాధి 'సాగా ఆఫ్ ఉమెన్ ఇన్ ఏటికొప్పాక' పేరుతో ఏటికొప్పాక కొయ్య బొమ్మలపై చిత్రీకరించిన వీడియోకు ప్రపంచంలో రెండవ స్థానం లభించడం గర్వకారణమని వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్.సూర్యప్రకాష్ తెలిపారు. గురువారం విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవం-2023 సందర్భంగా జెనివా (స్విట్జర్లాండ్)లో అంతర్జాతీయ మేధో సంపత్తి, మహిళల పాత్ర గురించి వీడియో పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. మేధోసంపత్తిపై మహిళల పాత్ర, జీవనోపాధిని మెరుగుపరచడానికి, సానుకూల సామాజిక ప్రభావాన్ని సృష్టించడానికి మేధోసంపత్తి హక్కులను ఉపయోగిస్తున్న మహిళా ఆవిష్కరణ కర్తలు, సృష్టికర్తలు, వ్యవస్థాపకుల యొక్క వినూత్నమైన స్ఫూర్తిదాయకమైన కథనాలను ఈ పోటీల్లో సంగ్రహించడం జరిగిందని తెలిపారు. ఈ పోటీల్లో 72 దేశాల నుండి 180కి పైగా వీడియోలు పాల్గొనగా, 22 మంది అంతర్జాతీయ న్యాయమూర్తుల సమక్షంలో కేవలం 10 వీడియోలను ఎంపిక చేయగా, అందులో డాక్టర్ నీలిమ పంపిన వీడియోకి ప్రపంచస్థాయిలో ద్వితీయ స్థానం లభించిందని చెప్పారు. చైనా దేశానికి చెందిన పూర్తో, రికోలకు ప్రథమ, తృతీయ బహుమతులు లభించాయన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నీలిమను దుశ్శాలువా కప్పి మెమెంటో అందజేశారు. ఆమెను ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.మధుసూదనరావు, ప్రొఫెసర్ ఎ.రాజేంద్ర ప్రసాద్, అధ్యాపకులు అభినందించారు.

భగీరథ కృషి, పట్టుదల యువతకు ఆదర్శం

ప్రజాశక్తి-అనకాపల్లి

భగీరథ మహర్షి కృషి పట్టుదల నేటి యువతకు ఆదర్శమని కలెక్టర్ రవి పటాన్ శెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగీరథుడు తన తపస్సుతో గంగను భూమికి తెచ్చారని, తద్వారా సమాజానికి ఎంతో మేలు చేశారని తెలిపారు. రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్ గుర్రం రాజేష్ కుమార్ మాట్లాడుతూ సగర కులాన్ని బీసీ డి నుంచి బీసీ ఎకి మార్చాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటరమణ, జెడ్పి వైర్ చైర్‌పర్సన్ బివి సత్యవతి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిని రాజేశ్వరి, సగర సంఘం నాయకుపలు గుర్రం నూకరాజు, నక్క రాంబాబు, నక్క పెంటయ్య, గుర్రం నాగరాజు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని పిపి అగ్రహారం శివారు ఉప్పరగూడెంలో గురువారం భగీరథ జయంతి వేడుకలను నిర్వహించారు. భగీరథుని విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గూనూరు మల్లు నాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, నాయకులు కొరుకొండ రవికుమార్, జిల్లా సగర సంఘ అధ్యక్షులు గుర్రం నూకరాజు పాల్గొన్నారు.

ఎంవిఆర్‌కు 'సర్వజ్ఞ' ఆహ్వానం

ప్రజాశక్తి- అనకాపల్లి : విశాఖ జిల్లా నరవ విట్స్ కళాశాలలో శుక్రవారం నిర్వహించే సర్వజ్ఞ సంస్థ అంత ప్రేరణ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను నిర్వాహకులు గురువారం ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావుకు అందజేశారు. గుజరాత్‌కు చెందిన శ్రీ లక్ష్మానంద భారతి స్వామి, ఒటిపి వాగ్మీ మీడియా సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మంచాల సుధాకర్ నాయుడు, విట్స్ కళాశాల చైర్మన్ జి సత్యనారాయణ, సర్వజ్ఞ ఫౌండర్ సీఈవో డాక్టర్ పి అనిల్ కుమార్ తదితరులు కార్యక్రమానికి విచ్చేయవలసిందిగా ఎంవిఆర్‌ను కోరారు. ఈ సందర్భంగా ఎంవిఆర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు.

చలో అనకాపల్లిని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : దేశంలో 60 శాతంగా ఉన్న బీసీలకు గత ఎన్నికల్లో కేంద్రంలో బిజెపి ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన గుణపాఠం చెబుతామని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోను దుర్గా నరేష్, రాష్ట్ర విద్యార్థి విభాగం కన్వీనర్ కొసిరెడ్డి మురళీకృష్ణ హెచ్చరించారు. స్థానిక ఆనంద్ రెసిడెన్సీలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 29న హలో బిసి చలో అనకాపల్లి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నమని తెలిపారు. ఇందులో బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య పాల్గొంటారని, దానిని జయప్రదం చేయాలని కోరారు. సంఘం నాయకులు పిళ్ల నివాస్, కొసిరెడ్డి నరసింగరావు, లాలం మురళి, దుంగ నవీన్, తుంపాల గణేష్, కోనేటి లోవరాజు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు ప్రభుత్వం పెద్ద పీట

ప్రజాశక్తి- అనకాపల్లి : రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. మండలంలోని తుమ్మపాల గ్రామంలో గురువారం జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా కోటి 51 లక్షలతో నిర్మించిన ఇంటింటికి కుళాయిల నీటి సరఫరా పథకాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రాంగణంలో మొక్కలు నాటారు. వైసిపి నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, సర్పంచు తట్టా పెంటయ్య నాయుడు, ఎంపీటీసీ సభ్యులు పంచదారల కన్నారావు, పస్నీరు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని దిబ్బపాలెం పునరావాస కాలనీ, కొత్త కోడూరు, లక్ష్మీపురం, దేవల్లపాలెం, పాసెట్టి పాలెం గ్రామాలలో స్థానిక ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు, డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార్ వర్మ గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. సెజ్ నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలపాలని కోరారు. రాజాన విజయ్, అడిగర్ల దేవుడు, లాలం రాంబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు గురించి అమర్యాదగా మాట్లాడటం సరికాదు

ప్రజాశక్తి-అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అనంతపురం జిల్లా నార్పల బహిరంగ సభలో విద్యార్థుల ఎదుట చంద్రబాబు నాయుడు వయసుకు గౌరవం ఇవ్వకుండా మాట్లాడడం జగన్ రెడ్డి దిగజారుడుతనానికి నిదర్శనమని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆర్థిక నేరస్థుడు, తన తండ్రి వైయస్సార్ శవాన్ని పక్కనపెట్టి సోనియా గాంధీతో బేరసారాలు ఆడిన జగన్ రెడ్డికి చంద్రబాబు గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. రాజకీయాల్లో తన తల్లి, చెల్లిని సైతం తెలంగాణ రాష్ట్రానికి పంపిన ఘనుడు జగన్ రెడ్డి అన్నారు.

మంత్రి అమర్నాథ్‌కు విద్యాభివృద్ధిపై దృష్టి లేదు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు ఉద్యోగాలను అడిగిన విద్యార్థులపై దాడులు తప్ప విద్యాభివృద్ధిపై దృష్టి లేదని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ విమర్శించారు. రేబాక పాలిటెక్నిక్ కళాశాలను గురువారం ఆయన సందర్శించారు. తమ నాయకుడు చంద్రబాబు నాయుడు విజనకు రేబాక పాలిటెక్నిక్ కళాశాల నిదర్శనమన్నారు. తాను ఎమ్మెల్యేగా బిసి గురుకుల పాఠశాల, తేగాడ మోడల్ స్కూల్, పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలను తీసుకొచ్చినట్లు చెప్పారు. మంత్రి అమర్నాథ్ ఒక కళాశాలనైనా తీసుకొచ్చారా? అని ప్రశ్నించారు.

బి.కింతాడ పాఠశాలకు బీరువా వితరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని బోయిల కింతాడ ప్రాథమికోన్నత పాఠశాలకు స్థానికులు బీరువా బహూకరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అవసరం నిమిత్తం, బీరువాను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు గురువారం అందజేశారు. తెలుగు రైతు నాయకులు కొమార బాబూరావు, కడిమి నాగేశ్వరరావు, టిడిపి నాయకులు కాసుబాబు, త్రిమూర్తులు, ఆడప ఈశ్వరరావు, అన్నం త్రిమూర్తులు, రామకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం

మాజీ ఎమ్మెల్యే రామానాయుడు

ప్రజాశక్తి-మాడుగుల: రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని, అప్పుల్లో నంబర్ వన్ స్థానంలో నిలిచిందని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు తెలిపారు. తాలుత ఘాట్ రోడ్ జంక్షన్ వద్దాది ప్రధాన రహదారి దుస్థితి పై సెల్ఫీ చాలెంజ్ ఫోటో దిగిన ఆయన, మాడుగులలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, జగన్ కు, ఆ పార్టీ వారికి మాత్రమే తప్ప ప్రజలకు ఎటువంటి భవిష్యత్తు లేదని తెలిపారు. కేసుల నుండి తప్పించుకునే వ్యవహారం తప్ప ప్రజల కోసం పని చేస్తుంది ఏమీ లేదన్నారు. రాష్ట్రంలో దుర్మార్గ పరిపాలన నడుస్తుందని, రహదారులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాలుగేళ్ల పరిపాలనలో మాడుగుల నియోజక వర్గంలో ప్రధాన రహదారులు నరకాన్ని తలపి స్తున్నాయన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు కను మరుగై పోయాయని విమర్శించారు. తెలుగుదేశం హయాంలో తాచేరు రిజర్వాయర్‌కు రూ.7.50 కోట్లు, పురకగెడ్డ రిజర్వాయర్‌కు రూ.8.50 కోట్లు, పెద్దేరు ఎడమ కాలువకు 6 కోట్లు మంజూరు చేశామని, కొత్తగా అధికారం చేపట్టిన వైసిపి ప్రభుత్వం ఆయా పనులు ఎందుకు ప్రారంభించ లేదని ప్రశ్నించారు. పెద్ద యెత్తున ఇసుక దందా నడుస్తుందని, తారువ వంతెన వద్ద ఇసుక తవ్వకాల కారణంగా పిల్లలకు ప్రమాదం వాటిల్లిందన్నారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ లేదని, ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పెన్షనర్లకు సకాలంలో జీతాలు, పింఛన్లు సైతం ఇవ్వడం లేదని తెలిపారు. అమరావతి ప్రాంతాన్ని మోసం చేశారని, అభివృద్ధి శూన్యం కాగా, నేతల సెటిల్ మెంట్లతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. ఎల్.పోన్నవోలు ప్రాంతంలో భారీ భూ కుంభకోణం జరిగిందన్నారు. బలవంతంగా ఇంటింటికి స్టిక్కర్లు అతికిస్తున్నారని విమర్శించారు. చేసిన పనులకు డబ్బులు రాక ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చివరికి వైసిపి సర్పంచులే తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు రంజిత్ వర్మ, పంతులు మూర్తి కొట్నాల త్రినాథ్, గండి గోవిందు, డిల్లీ నానాజీ, మరువాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును చూపుతున్న రామా నాయుడు

విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రాజు,తాతయ్యబాబు

ఎన్‌టిఆర్ విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో పొన్నవోలు గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని గురువారం చోడవరం నియోజవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పై ఉన్న అభిమానంతో గ్రామస్తులు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తెలుగు వారి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఎన్టీ రామారావుది అన్నారు. విగ్రహం ఆవిష్కరించడానికి అవకాశం కల్పించిన పొన్నవోలు గ్రామస్థులకు, పార్టీ నాయకులకు తాము ఎప్పుడు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రాజాన కొండనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోమం నిర్వహిస్తున్న సంస్థాన వారసులు

శతకంపట్టు వద్ద హోమం

ప్రజాశక్తి-మాడుగుల:ఇటీవల దహనం అయిన శతకంపట్టు వద్ద గురువారం మాడుగుల సంస్థాన వారసులు హోమం నిర్వహించారు. మార్చి నెలలో మతి స్థిమితం లేని వ్యక్తి నిప్పు అంటించడంతో శతకంపట్టు కాలి పోయింది. కొద్ది కాలంలో మోదకొండమ్మ పండగ నిర్వహించవలసి ఉంది. పండుగకు శతకం పట్టు ఎంతో ప్రాముఖ్యమైంది కావడంతో గురువారం ప్రమాద పరిహార నిమిత్తం కోట వారసులు హోమం నిర్వహించారు. రాజమాత మయాంక్ కుమారి దేవ్, లలిత్ దేవ్ ఈ కార్యక్రమం నిర్వహించారు.వేద పండితులు ప్రసాద్, సంతోష్, సోమసుందరం, జరగుమిల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో హోమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, నంగేటి సూర్యారావు, శ్రీనాథ్ శ్రీనివాసరావు, పైడి నాయుడు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బంది కొరత

ప్రజాశక్తి -కోటవురట్ల: తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత కారణంగా అన్ని వర్గాల ప్రజలు సహ ఉన్న సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారు ప్రధానంగా టైపిస్టు లేక పోవడంతో పాటు గతంలో ఇద్దరు రెవెన్యూ ఇన్స్పెక్టర్లు ఉండగా ఇప్పుడు ప్రస్తుతం ఒకరు మాత్రమే ఉన్నారు. అదే విధంగా మండలంలో 25 గ్రామపంచాయతీలకు 19 రెవెన్యూ గ్రామాలు ఉండగా 13 గ్రామ రెవెన్యూ అధికారులు మాత్రమే ఉన్నారు. పందూరు, చౌడువాడ, సుంకపూరు, అన్నవరం, జల్లూరు, అన్నవరం, కోటవురట్ల1 గ్రామాలకు రెవెన్యూ అధికారులను నియమించాల్సి ఉంది, గ్రామ రెవెన్యూ సహాయకులకు సంబంధించి 35 మంది ఉండాల్సి ఉండగా 28 గ్రామ సహాయకులు మాత్రమే ఉన్నారు. కైలాసపట్నం1, చౌడువాడ 1, జల్లూరు 1, సుంకపూరు 1, అన్నవరం 1, పాములవాక 2 చొప్పున ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా ప్రభుత్వం ఇటీవల నియమించిన సచివాలయ సర్వేయర్లు చినబొడ్డేపల్లి, వెంకటాపురం, బోడపాలెం, కోటవురట్ల గ్రామాల్లో ఖాళీగా ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని మండల వాసులు కోరుతున్నారు.

పీడీపై ఫిర్యాదు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:జిల్లా కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించిన మెప్మా పిడిపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడం జరిగిందని నర్సీపట్నం మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య తెలిపారు. ఈ మేరకు గురువారం జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్రతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సౌజన్య మాట్లాడుతూ, 11.10.2021న అప్పటి ఉమ్మడి విశాఖజిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనలో నర్సీపట్నం మున్సిపాలిటీలో జరిగిన వైయస్సార్ ఆసరా పథకం అవినీతిని తెలియజేశామన్నారు. దీంతో కలెక్టర్ ఈ విషయాన్ని మెప్మా కు అప్పజెప్పడం జరిగిందని, దర్యాప్తు చేసిన పిడి తప్పుడు సమాచారాన్ని అప్పటి ఉమ్మడి విశాఖ జిల్లా కలెక్టర్కు ఇచ్చారన్నారు.ఒక రోజు జరిగిన వైయస్సార్ ఆసరా ప్రోగ్రాం ఏడు రోజులు జరిగిందని చూపించి రూ.11.70లక్షల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన అధికారులతో చేతులు కలిపిన పిడి తప్పుడు నివేదిక ఇవ్వడం జరిగిందన్నారు. ఈ విషయమై తాము స్థానిక వార్డు సచివాలయంలో సమాచార హక్కు చట్టం ద్వారా సంప్రదించగా కేవలం ఒక్క రోజు మాత్రమే ప్రోగ్రాం జరిపినట్లు తమకు వివరణ ఇచ్చారన్నారు. ఈ విషయమై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరగా ఆయన స్పందిస్తూ జిల్లా రెవెన్యూ అధికారికి దర్యాప్తు చేయాలని ఆదేశించారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, నాయకులు పొలుపర్తి సూరిబాబు, నమ్మి రమణరాజు, యామేష్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

త్వరలో వైసిపి ప్రచార కమిటీల నియామకం

ప్రజాశక్తి- పాయకరావుపేట :వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు త్వరలో అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా పార్టీ ప్రచార కమిటీలను నియమించడం జరుగుతుందని ఆ పార్టీ అనకాపల్లి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా అన్నారు. పాయకరావుపేట లోని స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దగ్గుపల్లి మాట్లాడుతూ, వైసిపి రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షులు ధనుంజయరెడ్డి సూచన మేరకు జిల్లాలోని ఆయా నియో జకవర్గాల్లో పార్టీ ప్రచార విభాగాలను నియమిస్తామని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న సాయిబాబా

సోషల్ ఆడిట్‌పై శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లులో గురువారం సోషల్ ఆడిట్ పై ఓరియంటేషన్ తరగతులపై ఎంఈఓ డివిడి ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. పాఠశాలల్లో అమలవుతున్న వివిధ కార్యక్రమాలు, నిర్వాహణ తీరును పరిశీలించడానికి ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌ల ఆధ్వర్యంలో తల్లిదండ్రులు కమిటీలతో తనిఖీ చేయించడం జరుగుతుందన్నారు. పాఠశాలల పనితీరును కమిటీ బృందం వివిధ అంశాలలో పరిశీలించడం జరుగుతుందన్నారు. పాఠశాలల పనితీరు మూల్యాంకనం ద్వారా సమస్యలను గుర్తించి అభివృద్ధిని మెరుగు పరచుకోవడానికి ఇది దోహద పడుతుందన్నారు. పాఠశాలల్లో లింగ అసమానతలను తగ్గించడం, బాల్య వివాహాల నిర్మూలన, మధ్యలో బడిమానే వేసిన పిల్లలను బడిలో చేర్పించడం వంటి వివిధ అంశాలపై మూల్యాంకనం ద్వారా గుర్తించి వాటి పరిష్కారాలకు మార్గం సుగమం అవుతుందన్నారు. తల్లిదండ్రుల కమిటీ సభ్యులకు, తల్లిదండ్రులకు, పాఠశాలల్లో బోధన బోధనేతర సిబ్బంది లో జవాబు దారీతనాన్ని పెంచడానికి ఇది దోహద పడుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలకు పి.వి.సన్యాసినాయుడు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. వివిధ పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు వై.అప్పారావు, కృష్ణమోహన్ పుష్పరాగం, ప్రతాప్ కె.జి.బి.వి. ప్రిన్సిపాల్ వై.త్రివేణి, గురుకుల పాఠశాల ఉపాధ్యాయురాలు మాధవి, ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పశువులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-మాడుగుల:పాడి రైతులు ప్రభుత్వం కల్పించిన ఉచిత గర్భధారణ ఎద ఇంజెక్షన్ల పథకాన్ని వినియోగించుకోవాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు చిట్టి నాయుడు కోరారు. మండల కేంద్రంలో మరిడిమాంబ గుడి వద్ద పశు విజ్ఞాన బడి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సంచార పశు వైద్య వాహన సిబ్బంది ఆధ్వర్యంలో 18 గర్భకోశ వ్యాధులకు చికిత్స, 8 పశువులకు చూడి పరీక్షలు, 38 పశువులకు పేడ, రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబులెన్స్ పశు వైద్యాధికారి శైలేంద్ర, వెటర్నరీ అసిస్టెంట్ కిషోర్, లైవ్ స్టాక్ అసిస్టెంట్ సౌజన్య, టెక్నీషియన్ కుమారి పాల్గొన్నారు.

పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

విద్యార్థులకు మందుల పంపిణీ

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని జి.అగ్రహారం ప్రభుత్వ పాఠశాలలో వేసవి దష్టిలో పెట్టుకొని ముందు జాగ్రత్తగా వివిధ రకాల మందులు పంపిణీ చేశారు.వడ్డాదికి చెందిన అతిధి దేవో భవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వడదెబ్బ ఉపశమన హోమియోపతి మాత్రలు పంపిణీ చేశారు. సంస్థ ప్రధాన కార్యదర్శి ఆరిపాక కామేశ్వరరావు వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీ, ఉపాధ్యాయులు ప్రసాదరావు, పైడి రాజు, అప్పారావు, పి.చంద్రరావు, బేగం, రాజు గణేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వామనమూర్తి

ఉద్యమాలతో కార్మికులకు రక్షణ

ప్రజాశక్తి- రావికమతం:ఉద్యమాలతోనే ఆటో కార్మికులకు రక్షణ లభిస్తుందని ఏఐటియుసి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు జి.వామనమూర్తి తెలిపారు. మండల కేంద్రం లో గురువారం ఆటో డ్రైవర్ల సమావేశమైన ఆయన మాట్లాడుతూ, ఆటో నడపడంతో ఉపాధి పొందుతున్న డ్రైవర్లు కు, ఆటో ఓనర్స్‌కు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం పట్టించు కోలేదన్నారు. మరొక వైపు డీజిల్, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, ధరల పెంపు తో పాటు ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం 894 నెంబర్ జిఓ, రాష్ట్రప్రభుత్వం 21 నెంబర్ జీవో లు తెచ్చి ఆటో కార్మికుల ఆర్థిక భారానికి కారణమయ్యాయన్నారు. పోరాటం ద్వారానే జీవోలు రద్దవుతాయన్నారు.

ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని చీడిగుమ్మల గ్రామంలో కాళీమాత అమ్మవారి ఆలయం ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిఠాపురం పీఠాధిపతి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద భారీ అన్నసంతర్పణ నిర్వహించారు.

11 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-గొలుగొండ:కృష్ణదేవిపేట, శరభన్నపాలెం జంక్షన్ వద్ద గురువారం తెల్లవారుజామున కెడిపేట ఎస్ఐ ఉపేంద్ర 11 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వలసంపేట గ్రామానికి చెందిన సద్దా వెంకటరమణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న శిరీషారాణి

చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి

ప్రజాశక్తి -నక్కపల్లి: చెత్త రహిత గ్రామాలుగా తీర్చి దిద్దాలని జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషా రాణి అన్నారు. గురువారం నక్కపల్లిలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం (లోకల్ ట్రైనింగ్ సెంటర్) వేంపాడులో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం ను సందర్శించారు. నక్కపల్లి కేంద్రంలో వర్మి కంపోస్టును పరిశీలించారు. సంపద కేంద్రం ద్వారా సంపదను సృష్టించుకోవాలన్నారు. కేటాయించిన మండలాలకు శిక్షణ పక్కాగా నిర్వహించాలని సూచించారు. వేంపాడులో చెత్త నుండి సంపద తయారీ కేంద్రంను సందర్శించి, మరింతగా నిర్వహణ చేయాలని సూచించారు. గ్రామాల్లో శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్, శ్రీను పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో కాలేజి అధ్యాపకులు

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి -పాయకరావుపేట: స్థానిక శ్రీ ప్రకాష్ అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్లు గత వారం రోజులుగా పాయకరావుపేట మండలం సీతారాంపురంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరం గురువారంతో ముగిసాయి. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.టి నాయుడు మాట్లాడుతూ, ఈ గ్రామంలో వ్యాధులపై అవగాహన ర్యాలీ, స్వచ్ఛభారత్, శానిటేషన్, కంటి వైద్య శిబిరం తదితర కార్యక్రమాలు చేపట్టామన్నారు. హెచ్ఎం జీవి రాఘవులు మాట్లాడుతూ, యువత దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి.వెంకట కృష్ణ,వైస్ ప్రెసిడెంట్ పి.మరిడయ్య, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన సిటియు వీసీ టివి.కట్టమణి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (ఆంధ్రప్రదేశ్) ఉపకులపతి ఆచార్య టివి.కట్టమణి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఏయూ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు అందజేశారు.

గ్రంథాలయాన్ని బలోపేతం చేస్తాం : వీసీ

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయంలోని డాక్టర్ విఎస్.కృష్ణ గ్రంథాలయాన్ని మరింత బలోపేతం చేస్తామని ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి అన్నారు. గురువారం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో గ్రంథాలయంలో వినియోగానికి నూతనంగా అందుబాటులోకి వచ్చిన సోల్ 3.0 వెర్షన్ సాఫ్ట్‌వేర్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు, పరిశోధకులకు, ఆచార్యులకు గ్రంథాలయ సేవలు మరింత ఉపయుక్తంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. చరిత్ర, ఆర్కియాలజీ విభాగాలలో ఉన్న తాళపత్రాలను సైతం గ్రంథాలయం తీసుకుని డిజిటలైజేషన్ చేయాలని సూచించారు.

బిజెపితో కార్మిక చట్టాలు నిర్వీర్యం

ప్రచార భేరిలో సిపిఎం, సిపిఐ నేతలు

సబ్బవరంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ప్రజాశక్తి- సబ్బవరం: ప్రజావ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బిజెపి మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు అన్నారు. సీపీఎం, సీపీఐ ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని పిఎసిఎస్ వాణిజ్య సముదాయం కూడలిలో గురువారం ప్రచార భేరి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం ప్రైవేట్‌పరం చేస్తుంటే వైసిపి ప్రభుత్వం ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, ఇతర విభజన హామీలను గాలికొదిలేసి రాష్ట్రానికి బిజెపి ద్రోహం చేస్తుంటే, రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు ప్రశ్నించకుండా మోడీ ప్రభుత్వానికి భజన చేయడం దారుణమన్నారు. మరో నేత బి.ప్రభావతి మాట్లాడుతూ బిజెపి హయాంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను, గ్యాస్, పెట్రోల్ ధరలను పెంచి పేదలు, సామాన్యుల నడ్డి విరిచిందని విమర్శించారు. అనంతరం పిఎసిఎస్ వాణిజ్య కూడలి నుండి ఎన్టీఆర్ జంక్షన్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ, మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి, నాయకులు కె కోటేశ్వరరావు, పలు కార్మిక సంఘాల నాయకుడు పూడి అప్పల నాయుడు, గొంతిన అప్పారావు(చంటి), బర్ల రమణ, మొల్లేటి గౌరీశ్వరరావు, భవాని, అరుణ, బలిరెడ్డి సోము నాయుడు పాల్గొన్నారు.

సిపిఎం ప్రచార భేరి

అచ్యుతాపురం : మండలంలోని కొండకర్ల, దోసూరు గ్రామాల్లో సిపిఎం నాయకులు ప్రచార భేరి నిర్వహించారు. ఉపాధి హామీ పని ప్రదేశానికి వెళ్లి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఆర్.రాము, కె.సోమునాయుడు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందని, దానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జయమ్మ, నూకరాజు, భవాని, పార్వతమ్మ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

మాకవరపాలెంలో..

మాకవరపాలెం : మండల కేంద్రం మాకవరపాలెంలో సిపిఎం, సిపిఐ నాయకులు గురువారం ప్రచార భేరి నిర్వహించారు. ప్రధాన రహదారిలోని ప్రతి ఒక్కరికీ కరపత్రాలు పంపిణీ చేసి బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి పాలపర్తి తాతబ్బాయి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు డి.సత్తిబాబు మాట్లాడుతూ బిజెపి కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసిందని, రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలను తీసుకొచ్చి రైతు గిట్టుబాటు ధర లేకుండా చేసిందని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 28న నర్సీపట్నంలో జరుగు బహిరంగ సభలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు నల్లబల్లి శ్రీరామ్మూర్తి, వంటాకుల భవాని, బంగారు సత్యనారాయణ, గీతా కృష్ణ పాల్గొన్నారు.

ఎయుతో ఎక్సైజ్ శాఖ అవగాహన

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్రాయూనివర్సిటీతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎక్సైజ్ శాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అవగాహన ఒప్పందంలో భాగంగా ఏయులో ఆల్కహాల్ టెస్టింగ్ కోసం ప్రాంతీయ ప్రయోగశాలను ఏర్పాటు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.3 కోట్ల పరికరాలతో ప్రాంతీయ స్థాయి ప్రయోగశాలను ఏర్పాటు చేయనుంది. వీసీ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బెండపూడి శ్రీనివాసు అవగాహన ఒప్పందంలో సంతకాలు చేశారు.

మదిని దోచిన మధుర గీతాలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : సాయిశ్రీ స్వర సంగీత సేవా సంస్థ ఆధ్వర్యాన గురువారం సాయంత్రం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి సంగీత ప్రియుల్ని కట్టి పడేసింది. జయ జయ శుభకర, కళ్ళల్లో కళ్ళు పెట్టి చూడు, మధురమే సుధాగానం, పచ్చ బొట్టేసినా, జాబిల్లి రావే, పరువం వానగా, సుప్రీం హీరో, భలే భలే మగాడివో వంటి ప్రజాదరణ పొందిన గీతాలను గాయకులు ఆశా మధు, రైల్వే రమణ, గుణశ్రీ, ఎమ్మెస్ మాధవ్, ఎస్ఎస్ఎన్ రాజు, లోకేష్, మల్లికా చౌదరి, మహ్మద్ ఖాన్, లయ, గీత, ఆంజనేయరెడ్డి, రాజారావు, రామ్ కుమార్, జాస్మిన్, గౌరి, డి.అప్పారావు, వెంకటేష్, నాయుడు, రాము, దేవదాసు ఆలపించారు. ముందుగా విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు కొణతాల రాజు జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు చెన్నా తిరుమలరావు, సంస్థ అధ్యక్షులు ఎం.ఆశా మధు, కోశాధికారి ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో

సత్తా చాటిన శ్రీ ప్రకాష్ విద్యార్థులు

ప్రజాశక్తి -పాయకరావుపేట: ఇంటర్ ఫలితాలలో స్థానిక శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ విద్యార్థులు మంచి ఫలితాలతో విజయ దుందుభి మోగించారని కళాశాల ప్రిన్సిపల్ వివిఎస్ఎస్ భానుమూర్తి తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో సిహెచ్ జ్యోత్స్న అఖిల 990, కె.సత్య సూర్య విజయలక్ష్మి 987 మార్కులు సాధించారని, బైపిసిలో యు నాగ సూర్య ఉమా వెంకటేష్ - 983, కె.స్రవంతి 981 మార్కులు సాధించారన్నారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీలో ఆర్.భాను శ్రీ తులసి వర్షిణి -465, జి.శ్రీనీల -461 మార్కులు సాధించారన్నారు. బైపిసిలో ఎన్.మేఘన -430, కె.లాస్య నందిని - 428 మార్కులు సాధించి అగ్ర గాములుగా నిలిచారని అయన తెలిపారు. 980 కి పైగా మార్కులు శ్రీ ప్రకాష్ విద్యార్థులు 10 మంది సాధించారని అయన తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్ వికె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

టిడిపి బూత్ కన్వీనర్లకు శిక్షణ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నియోజకవర్గంలోని పలు మండలాల తెలుగుదేశం పార్టీ బూత్ కన్వీనర్లకు ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ శిక్షణను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో స్థానిక కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, 2024 లో తెలుగుదేశం పార్టీ గెలుపే ధ్యేయంగా అందరూ కష్టపడి పని చేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని వివరిస్తూ...మనం చేసిన అభివద్ధిని ప్రజలకు కళ్ళ కట్టినట్టు చూపించాలన్నారు.

చింతకాయల విజయ్ మాట్లాడుతూ, సోషల్ మీడియా వేదికగా మరింత ఉత్సాహంగా పని చేయాలన్నారు. అరాచకాలను, అక్రమాలను, దౌర్జన్యాలను, ప్రజలకు సోషల్ మీడియా వేదికగా తెలియజేయాలన్నారు. బూత్ స్థాయిలో పని చేసే బూత్ కన్వీనర్లు అప్పగించిన 50 కుటుంబాలకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేర వేయాలన్నారు. ఈకార్యక్రమంలో నర్సీపట్నం నియోజకవర్గంలోని 4 మండలాలు మున్సిపాలిటీకి సంబంధించి సోషల్ మీడియా సభ్యులు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విజయ్